@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

ఆదివారం
11 అక్టోబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :100
పేజీలు : 12 వెల : 5/-

IN MEDIA PUBLICATION PVT LTD



వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE




## మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

- చేసిన నేరాలకు మూల్యం చెల్లించాల్సిందే'
- చెన్నైలో జరిగిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది



## గెలిస్తే నిజాయతీ ఓడితే అవకతవకలా

- ఈసీకి మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌ల బహిరంగ లేఖ
- భారత ఎన్నికల సంఘానికి, సర్ ప్రక్రియకు మద్దతుగా 124 మంది సభ్యుల మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల
- ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదు

# భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం

- విద్యుత్ సమస్య ఉంది – పొదుపుగా వాడుకోండి
- ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.
- వచ్చే జూన్ వరకు తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ఇప్పటి నుంచి వచ్చే పకడ్బందీ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని
- రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి



హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభం పొంచి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కోవిడ్ తరహాలో ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. వచ్చే జూన్ వరకు తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ఇప్పటి నుంచి వచ్చే పకడ్బందీ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విస్తృత ప్రచారం చేసి ప్రజలను భాగస్వాముల్ని చేయాలని చెప్పారు. త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తక్షణ చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో సంక్షోభ - మిగతా9లో



## ఎంఎస్ఎంఈ బలోపేతానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఎంఎస్ఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి
- రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది
- దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కింది

హైదరాబాద్

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఎంఎస్ఎంఈను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు.లఘు ఉద్యోగ్ భారతి (తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని తాజ్ డెక్కన్ లో శనివారం నిర్వహించిన "ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ - మిగతా9లో

## నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

- దిల్లీలో ఉద్రిక్తతకు దారితీసిన సీజేపీ నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి
- నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## రాష్ట్రంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



- రాష్ట్రంలో తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు
- రోజుల పాటు బతుకమ్మ సంబురాలు కనుల పండువగా జరగనున్నాయి.
- పెళ్లైన పడతులు పుట్టింటికి వచ్చి ఆనందంగా జరుపుకునే పండుగ ఇది




## విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి కేసు నమోదు చేసిన ఎన్ఐఏ

- విమానం గాల్లో ఉండగానే కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది.
- ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది.

# కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ





- ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి!
- ప్రశాంతంగా ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు
- ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఈయూ కూటమి విజయం
- కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు అందించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు కార్మికులు గట్టి షాక్ ఇవ్వడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
- తెలంగాణలో దశాబ్ద కాలం తర్వాత జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నిక తుది ఘట్టానికి చేరింది

హైదరాబాద్

తెలంగాణలో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పదేళ్ల తర్వాత ఎన్నికలు జరగడంతో కార్మిక సంఘాలు అధికారంలోకి వచ్చేందుకు విస్తృత ప్రచారాలు నిర్వహించాయి. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఈయూ కూటమి విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు అందించిన తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు కార్మికులు గట్టి షాక్ ఇవ్వడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో దశాబ్ద కాలం తర్వాత జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నిక తుది ఘట్టానికి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో 98 శాతం పోలింగ్ నమోదైంది. బరిలోకి దిగిన మూడు కూటముల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయం దిశగా దూసుకెళ్తోంది. మొత్తం 11 రీజియన్లలో ఎనిమిదింటిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తైంది. ఇందులో 5 రీజియన్లలో ఈయూ - మిగతా9లో

## పాకిస్థాన్‌లో మరో దారుణం..

- క్రైస్తవుడి ఇల్లు, షాప్‌కు నిప్పు.. 35 కుటుంబాల వలస
- పాకిస్థాన్‌లో క్రైస్తవుడిపై దైవదూషణ ఆరోపణలు
- ఆగ్రహంతో ఇల్లు, దుకాణాన్ని తగలబెట్టిన ముస్లిం మూక
- భయంతో 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు గ్రామం విడిచి పరారీ
- భారీగా పోలీసుల మోహరింపు, దర్యాప్తు ప్రారంభం
- దైవదూషణ చట్టాల దుర్వినియోగంపై తీవ్ర ఆందోళన



# సంపాదకీయం

## విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప? దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన? శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే? ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం? అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన? ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా? క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే? దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్ప పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

# ఢిల్లీ పాలకుల గుండెల్లో రైళ్లు



రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, హస్తిన పాలకులు ఆడుతున్న ప్రమాదకరమైన ఆట భవిష్యత్తు రాజకీయాలను నియంతృత్వ పోకడల వైపు మళ్లిస్తున్నది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఆడుతున్న నాటకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.ఈ నేపథ్యంలో సర్ పేరిట జరిగిన అక్రమాలపై బాధ్యత వహిస్తూ సీఈసీ రాజీనామా చేయాలని యువతరం పోరుబాట పట్టింది. నేడు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ఆందోళనకు సిద్ధమైంది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో 'జెన్-జీ సీజన్-1' ఆందోళన దెబ్బను రుచిచూసిన బీజేపీ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అందుకే ఢిల్లీకి వెళ్లే చాలా రైళ్లను రద్దు చేశారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వల్ల ఏర్పడే పాలనా వ్యవస్థ. ప్రజలే తమ పాలకులను ఎన్నుకునే గొప్ప విధానం. ప్రపంచంలో కాలక్రమంలో రాచరికం, నియంతృత్వం, సైనిక పాలన ఇలా ఎన్నో రకాల పాలనా పద్ధతులు రాజ్యమేలాయి. కానీ మహోన్నతమైనది, అత్యాధునికమైనది ప్రజాస్వామ్యమే. కానీ ఈ వ్యవస్థలోనూ కొందరు నియంతృత్వ పోకడలు కలిగిన నేతలు ప్రవేశించడంతో సమస్యలు మొదలయ్యాయి. దేశ, రాజ్యాంగ నిర్మాతలు గొప్ప వ్యవస్థలను రూపొందించారు. కానీ పాలకులకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై విశ్వాసం లేకపోతే అవి అమలుకు నోచుకోవడం కష్టమే. కేంద్రంలో పద్నాలుగేండ్లుగా బీజేపీ పాలనలో ప్రజాస్వామిక విలువలు అపహాస్యం అవుతున్నాయి. ఏం చేసైనా, ఎంతకు దిగజారైనా అధికారం హస్తగతం చేసుకోవాలి, చేజిక్కిన అధికారాన్ని గుప్పిట్లోనే పెట్టుకోవాలి అనే అధికార, రాజ్యవిస్తరణ కాంక్షతో కమలం పార్టీ కార్యాచరణ అమలు చేస్తున్నది. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే సన్నద్ధత, శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం అవసరం. కానీ బీజేపీకి ఆ ధ్యాస లేదు. ఎంతసేపూ పగటివేషాలు, పడికట్టు పదాల ప్రసంగాలే పాలన అనుకుంటున్నది.

బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో చీలిక తీసుకొస్తున్నది. అభంశుభం తెలియని యువత మెదళ్లలో అసత్యాలతో విషం నింపి, వారిని అంధభక్తులుగా మార్చుతున్నది. ప్రజాతీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, ఇతర పార్టీలు అధికారంలో ఉన్నచోట పాలకపక్షాలను చీల్చడం, తమ బుట్టలో వేసుకోవడం, పొత్తు పెట్టుకున్న పార్టీల్లోనూ చిచ్చుపెట్టడం చూస్తూనే ఉన్నాం.

ఇక బీజేపీ పాలకుల 'వాషింగ్ పౌడర్ నిర్మా' రాజకీయాల గురించి తెలిసిందే! దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని నేతలను తమ పంచన చేర్చుకోవడం, వారికి పదవులు కట్టబెట్టడం, ఆ తర్వాత కేసులు మాఫీ కావడం ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నది. అధికారం దక్కించుకోవడం కోసం దబాయింపులకు పాల్పడు తూ, ఫిరాయింపులను ప్రోత్సహిస్తూనే మరో పక్కన ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నది.

ఆఖరికి ఓటరు జాబితా సమగ్ర సవరణ పేరుతో జరుగుతున్న ఓటర్ల ఏరివేత ప్రక్రియ తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. 'సర్' అనేది బోగస్ ఓటర్లను తొలగించేదిగా సాగాలి. కానీ లక్షలాది అర్హులైన ఓటర్లను అకారణంగా తొలగించడం, తాము అర్హులని నిరూపించుకునేందుకు సమయం ఇవ్వకపోవడం, ఈ లోపు ఎన్నికల తంతు పూర్తి కావడం, ఇదంతా చూస్తూ కూడా తప్పొప్పులు చెప్పాల్సిన వ్యవస్థలు చోద్యం చూడటం మరో విషాదం. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 22 ప్రకారం ఓటరు జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించాలంటే ముందుగా నోటీసు ఇచ్చి, వాదన విన్న తర్వాతనే నిర్ణయం తీసుకోవాలి. ఓటరు మరణిస్తే తప్ప, నోటీసు ఇవ్వకుండా జాబితా నుంచి పేరు తొలగించకూడదు. లాల్ బాబు హుస్సేన్ వర్సెస్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కేసులో సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని ఇటీవల నల్సార్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తేల్చిచెప్పారు.

కానీ గంపగుత్తగా ఓట్లను తొలగించడం, ఆ తర్వాత వాదన వినేందుకు టైమ్ ఇవ్వకపోవడం ఏం పద్ధతి? నోటీసులు ఇవ్వడం అంటే శాశ్వతంగా ఓటును తొలగించినట్టు కాదని అధికాలు సూక్తులు చెప్తున్నారు. విచారణ పూర్తయి, ఎప్పుడో తిగి జాబితాలో పేరు చేర్చుతారా? ఈ లోపు జరిగిన ప్రజాస్వామిక హననానికి ఎవరు బాధ్యులు? ఓట్ల తొలగింపు ఫలితాలు ఎలా ఉంటాయో బెంగాల్‌లో చూశాం. అక్కడ దాదాపు 91 లక్షల ఓట్లు తొలగించారు. అప్పీళ్లకు వెళ్లిన 27 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 65 మంది ఎన్నికల అధికారులు కూడా ఓటు హక్కును కోల్పోయారంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. ఎన్నికలు నిర్వహించడానికి అర్హత కలిగిన వాళ్లు, ఓటు వేయడానికి అర్హులు కాదన్నమాట. ఇదీ విచిత్రం. ఈ నేపథ్యంలో బీజేపీ 46 శాతం ఓట్లతో 206 సీట్లను దక్కించుకున్నది. చాలా నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థి మెజారిటీ, తొలగించిన ఓట్ల కంటే తక్కువ. అంటే ఓట్ల తొలగింపుతో గెలుపోటములు ప్రభావితమయ్యాయని తేలింది. కానీ ఈసీ నిష్పక్షపాతంగా ఉన్నదంటే నమ్మాలంట! 'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు.. నా యిచ్ఛయే గాక నాకేటి వెరపు' అనే కృష్ణశాస్త్రి కవిత గుర్తొస్తున్నది.

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడే క్రమం కూడా వివిధ పరిణామాలను సంతరించుకున్నది. గతంలో దొంగ ఓట్లు వేయడం, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి, రిగ్గింగ్‌కు పాల్పడటం, బ్యాలెట్ బాక్సులు ఎత్తుకెళ్లడం.. ఇలాంటి ఘటనలు జరిగేవి. ఇప్పుడు ఏకంగా ఓటర్లనే మాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు దేశంలో ప్రజాస్వామ్యం ఎటు పోతున్నది? ఇది నియంతృత్వానికి దారితీస్తున్నదా? అని అందరూ నిట్టూరుస్తున్న క్రమంలో ఒక ఆశాదీపంలా తళుక్కున మెరిసింది.. జెన్-జీ పోరాటం. పాలకపక్షాల అహంకార సౌధాలను కూల్చి, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేందుకు సిద్ధమైంది. అప్రజాస్వామిక పాలన రాజ్యమేలుతుంటే ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ విఫలమైంది.

చేతగాని, చేవలేని ఆ పార్టీ నాయకత్వం పట్ల ప్రజల్లో ఆశలు అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రజాస్వామిక హక్కులను బీజేపీ పాలకులు నడిబజారులో బేరానికి పెడుతుంటే, చూసి తట్టుకోలేక యువతరం కదం తొక్కింది. 'ఇది మా దేశం, మా భవిష్యత్తును మేం కాపాడుకుంటాం' అని పోరు నడుపుతున్నది. ఈ క్రమంలో ఈసీలో అంతర్గతంగా జరిగిన లుకలుకలు బయటపడుతున్నాయి.

కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం-6పై ఇద్దరు ఈసీల అభ్యంతరాలను సీఈసీ పరిగణనలోకి తీసుకోలేదని బయటపడ్డది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం సంచలనం సృష్టించింది. ఇక జెన్-జీ, ప్రజాపోరాటం ఉధృతమైంది. నేడు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరుగనున్నది. దీంతో ఢిల్లీ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రద్దీ ఏర్పడుతుందనే సాకులు చూపుతూ రైల్వేశాఖ పలు రైళ్లు రద్దు చేసింది. ప్రభుత్వం మెట్రో స్టేషన్లు మూసింది. బస్సులను నిలిపివేసింది. భారీ బలగాలను దింపింది. జెన్-జీకి, సీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతున్నది. శ్రీశ్రీ చెప్పిన 'పావన నవజీవన బృందావన నిర్మాతలు' వీళ్లేనని జనంతా జేజేలు పలుకుతున్నరు... విజయీభవ అని ఆకాంక్షిస్తున్నరు.

# ఆచి తూచి 'రిజర్వ్' అడుగు!




నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలూ, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకతప్పదని అంచనా వేస్తున్నారు. నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపీసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు అధికంగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు.

మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచి 'క్రమానుగత కఠిన విధానం' దిశగా కదులుతున్నట్టు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగురంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. వీటన్నిటివల్లా కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్‌కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది. స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు 4 లక్షల కోట్ల రూపాయలుపైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కేశారు. మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్టని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి. వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటెలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిర్భయంగా రెపో రేటు పెంచటానికి ఏ సెంట్రల్ బ్యాంకుకైనా అనువైనది. అది నేలచూపులు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయటంద్వారా అది సాధ్యమేనని ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!

# మల్కారం క్వారీలో విషాదం.. ఈతకు వెళ్లి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

**జవహర్ నగర్ , అక్టోబర్ 10 (వార్త ప్రతినిధి) :**

జవహర్ నగర్ పరిధిలోని మల్కారం క్వారీలో జరిగిన ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

స్థానిక ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడలోని సాయిప్రియ కాలనీకి చెందిన ముమ్మారెడ్డి హేమలత కుమారుడు ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17), చేర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం (అక్టోబర్ 09) ఉదయం ప్రణవ్ సాయి ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లాడు. అయితే అదే రోజు సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో ప్రణవ్ స్నేహితులు, పోలీసులకు తల్లి హేమలతకు ఫోన్ చేసి, ఆమె కుమారుడు మల్కారం క్వారీలోని నీటిలో మునిగిపోయినట్లు సమాచారం అందించారు. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి చేరుకుని ప్రణవ్ స్నేహితులైన వైభవ్, భార్గవ్, శ్రీశాంత్ రెడ్డి, డి. తారకరామ్, ఎం. రిషి వర్ధన్, మయాంక్ కుమార్‌లను ఆరా తీశారు. వీరందరూ కలిసి సరదాగా ఈత కొట్టడానికి వెళ్లగా, ఈత కొడుతున్న సమయంలో ప్రణవ్ నీటిలో మునిగిపోయినట్లు వారు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి, నీటిలో నుంచి ప్రణవ్ మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



కళ్లముందే పెరిగి పెద్దవాడైన ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లి హేమలత కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

# ఉప్పల్ బాగాయత్‌లో కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 10 ( మన మీ వార్త):**

ఉప్పల్ బాగాయత్‌లోని కాలభైరవ స్వామి దేవాలయంలో అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ శాసనసభ్యుడు బండారి లక్ష్మారెడ్డి ఆలయాన్ని సందర్శించి కాలభైరవ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని భక్తితో ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాలభైరవ స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని



ప్రార్థించినట్లు తెలిపారు.

అమావాస్య సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ



ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి తో భేటీ అయిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి







**- పరమేశ్వర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వక సమావేశం.. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపు**

**ఉప్పల్, అక్టోబర్ 10 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి శనివారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు సమావేశమై పార్టీ వ్యవహారాలు, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి ఉప్పల్‌లోని పరమేశ్వర్ రెడ్డి నివాసానికి చేరుకోగా, ఆయన మర్యాదపూర్వకంగా స్వాగతించి సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, నాయకులు సమన్వయంతో పనిచేయడం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు సమష్టిగా పనిచేస్తూ ఎన్నికల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో జరిగిన ఈ సమావేశం మర్యాదపూర్వకంగా కొనసాగింది.

# తెలంగాణ అమరవీరుల త్యాగాల ఆశయ సాధనకు కృషి చేయాలి: ప్రొఫెసర్ కోదండరాం






**- పెత్తరమాస సందర్భంగా అమరులకు బియ్యమిచ్చే కార్యక్రమం**

**హైదరాబాద్ అక్టోబర్ 10 ( మన మీ వార్త):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, పెత్తరమాస సందర్భంగా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో శనివారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద "అమరులకు బియ్యమిచ్చే కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. మన గ్రామీణ సంప్రదాయంలో పెత్తరమాస రోజున పెద్దలకు బియ్యమిచ్చి, పూర్వీకులను స్మరించుకోవడం ఒక ఆచారమని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు.

గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం. నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, ఆశప్ప, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు జస్వంత్ కుమార్, రాష్ట్ర నాయకులు హనుమంత రెడ్డి, సర్దార్ వినోద్ కుమార్, ఆకుల శ్రీనివాస్, శేఖర్, నరేందర్,బాలరాజు, హనుమంతు గౌడ్, మల్లేష్, ఆనందం, కాకునూరు సుధాకర్, కిరణ్ కుమార్ రెడ్డి,పార్టీ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.



# శ్రీ శివ శంకర మహామాయి దేవాలయంలో అమ్మవారికి విశేష పూజలు అన్న ప్రసాద వితరణ





**ఉప్పల్, అక్టోబర్ 10 ( మన మీ వార్త):**

ఉప్పల్ లోని శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయం లో భద్రపద మాస అమావాస్య సందర్భంగా అమ్మవారి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ జరిగింది,ఈ కార్యక్రమం లో దేవాలయ సభ్యులు ఉప్పొజి బలవంత చారి,బిక్షపతి,రాజగోపాలచారి,శ్రీనివాస్,మధు,విజయ్,చోల్లేటి శ్రీనివాస్,శ్రీధర చారి పాలేర్ల గోపి,శామీర్ పేట హనుమంత్ రెడ్డి,మామిళ్ళ మల్లేష్,సాగు నగేష్, కృష్ణరెడ్డి,ఏసురి యాదగిరి,జగన్,నర్సింహా రెడ్డి,అభిరామా,కృష్ణ, గురువయ్య గౌడ్,నవీన్,ముడుగొండ రావి,,ప్రవీణ్ రెడ్డి,నర్సింహా చారి, తీగ విట్టల్ రావు,కొత్తకొండ రమేష్,మహేష్,జగన్,బిక్షపతి,రామ్ ప్రకాష్,గోపి చారి,పసుపు నేటి రమేష్,వెంకటయ్య,కుమార్,భాస్కర్ చారి,నవీన్ గౌడ్,రాజు,సందీప్,మహేష్ కుమార్,ప్రశాంత్ కుమార్,పవన్ కుమార్,భవాని శంకర్,సంతోష్ కుమార్,లక్ష్మణ్,సంతోష్ కుమార్,బంటి,శ్రీను,శ్రీనివాస్ గౌడ్,గణేష్ గౌడ్,యది గౌడ్,వెంకటేష్,తదితర భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బానోత్ శ్రీధర్ ఎంపిక

**చిట్యాల అక్టోబర్ 10( మీవార్త) :**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నేటి నుండి జరగబోయే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బానోతు శ్రీధర్ జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్ -14 ట్రయాథ్లాన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, సూదం సాంబమూర్తి తెలిపారు ఈ ఎంపిక పట్ల మండల విద్యాధికారి కొడపాక రఘుపతి విద్యార్థికి అభినందనలు తెలియజేశారు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు విద్యార్థికి పలువురు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

# విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పై దాడి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

**- ఎస్సై పోచంపల్లి సతీష్**

**చిట్యాల,అక్టోబర్10 మీ వార్త :**

విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే చిట్యాల పోలీస్ స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మారబోయిన మహేష్ శనివారం అర్ధరాత్రి సమయంలో డ్యూటీలో ఉండగా చిట్యాల సెంటర్‌లో ఘర్షణ జరుగుతోందని 112 కాల్ ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణను ఆపడానికి ప్రయత్నించారు.

ఆ సమయంలో తూముల గణేష్ .చిలువేరి దేవ. మరియు మదాసు సాయినాథ్ .అనే వ్యక్తులు కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగిస్తూ ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నిందితులపై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజా సేవలో అహర్నిశలు పనిచేసే పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించినా లేదా వారిపై దాడులకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకముందు ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఎస్సై సతీష్ స్పష్టం చేశారు.

# సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధి గా కొనసాగుతుంది

**మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



**వరంగల్, అక్టోబర్ 10:** సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం యథావిధి గా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా కలెక్టరేట్,తో పాటు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రజావాణి కి జిల్లా ప్రజలు హాజరై వారి సమస్యలు పై దరఖాస్తులు సమర్పించగలరని కోరడమైనది.

# మండల ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు

**- కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి**

**టేకుమట్ల అక్టోబర్ 10 (మన మీ వార్త ) :**



భక్తిశ్రద్ధలతో తోమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి మండల ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. పూల పండుగ బతుకమ్మ పువ్వులను పూజించే గొప్ప వేడుక ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే పండుగ తరతరాలుగా వస్తున్న తెలంగాణ సాంస్కృతిక వైభవం.. బతుకమ్మ!..

తొమ్మిది రోజుల పాటు రంగురంగుల పూలతో, ఆటపాటలతో, భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులందరికీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

## విజయ తెలంగాణ వరంగల్ డెయిరీ, హన్మకొండ జిల్లా అభివృద్ధికి రూ.1.85 కోట్ల నిధులు మంజూరు

- వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల పదార్థాల సరఫరాకు చర్యలు
- శ్రీ. జి. ధనరాజ్, ఉపసంచాలకులు, తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య. లి., వరంగల్ పాల పరిధి.

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



**హనుమకొండ:**వరంగల్ పాల పరిధిలోని విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, మరమ్మతులు మరియు మౌలిక వసతుల మెరుగుదల కోసం తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె.చంద్రశేఖర్ రెడ్డి ఐఏఎస్ గారి ఆదేశాల అనుసారంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చహత్ బజ్పాయ్ ఐఏఎస్ గారికి నివేదిక ఇవ్వడం జరిగింది.

హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చహత్ బజ్పాయ్ ఐఏఎస్ గారు రూ.1.85 కోట్ల నిధుల మంజూరూ కు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. మొదటి విడత గా రూ.89.50 లక్షలు నిధులు మంజూరు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చారు. విజయ తెలంగాణ డెయిరీని ఆధునీకరించి, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు, పాడి రైతులకు మరియు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది.

విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, ఆధునీకరణ పనుల దృష్ట్యా విజయ తెలంగాణ డెయిరీ ప్రధాన కార్యాలయం, హైదరాబాద్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా లోని వరంగల్ డెయిరీలో ప్యాకింగ్ కార్యకలాపాలను 10-10-2026 నుండి తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుంది.అయినప్పటికీ, వినియోగదారులకు పాలు మరియు పాల పదార్థాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా, మెగా డెయిరీ, రావిర్యాల నుండి పాలు మరియు పాల పదార్థాలను దిగుమతి చేసి, గ్రేటర్ వరంగల్ పరిధిలోని వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

ఈ నేపథ్యంలో పాల పంపిణీదారులు, ఏజెంట్లు, విక్రయదారులు, వినియోగదారులు మరియు పాడి రైతులు సహకరించి, విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి కార్యక్రమాలకు విజయవంతం కావడానికి తోడ్పడాలని అధికారులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్ గారు మరియు జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారంతో డెయిరీ అభివృద్ధి, పాడి రైతుల ప్రయోజనాల పరిరక్షణ, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తుల సరఫరా మరియు సంస్థ అభివృద్ధికి అవసరమైన చర్యలు కొనసాగుతాయని జి. ధనరాజ్, ఉపసంచాలకులు, వరంగల్ పాల పరిధి తెలిపారు.

ఉపసంచాలకులు వరంగల్ పాల పరిధివిజయ తెలంగాణ డెయిరీ,హనుమకొండ

## సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సేవలు అభినందనీయం డాక్టర్ పావుశెట్టి శ్రీధర్

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :





**హనుమకొండ :**ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సేవలు అభినందనీయమని అంజన హోమియో కేర్ ఆసుపత్రి అధినేత, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ కొనియాడారు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన మినీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జట్టు అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లి సాంబశివరావు, సెక్రెటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారులు సాఫ్ట్బాల్ క్రీడాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11, 12 వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. అంతకుముందు హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, జాయింట్ సెక్రటరీ సుమలత, కోచ్ పోలేపాక వినయ్ కుమార్, ఆసోసియేషన్ ప్రతినిధులు అర్జున్, రాజేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్లు ఏ. సృజన, శోభ, తాబేటి నాగరాజు, సీనియర్ క్రీడాకారులు పవన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన విదేశీ, డిఫెన్స్ మద్యం స్వాధీనం

(మన మీ వార్త న్యూస్) అక్టోబర్ 10, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):



నిజామాబాద్ నగరం లో అక్రమంగా నిల్వ ఉంచిన విదేశీ, డిఫెన్స్ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణ్కుమార్ వివరాలు వెల్లడించారు.సిటీ గైడ్స్ చూడండి

నగరంలోని న్యాల్కల్, ముబాకర్నగర్ లో ఇద్దరు వ్యక్తుల వద్ద విదేశీ, డిఫెన్స్ మద్యం అక్రమంగా నిలువ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో మూడ భాస్కర్, కంతాల గంగారత్నం ఇళ్లలో 110బాటిళ్ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బాటిళ్లను వారు విదేశాల నుండి వచ్చిన వారి నుండి కొనుగోలు చేశారని.. అలాగే ఇతర మార్గాల ద్వారా డిఫెన్స్ మద్యం తక్కువ ధరకు కొనుగోలు చేశారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ హెచ్ వో సరిత, సిబ్బంది నజీర్ హుస్సేన్, గజేందర్, వి. రవి తదితరులు పాల్గొన్నారు.

# సుర్మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు







- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 9 ( మన మీ వార్త):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఉప్పల్లోని సుర్మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూలతో కళకళలాడుతూ పండుగ శోభను సంతరించుకుంది.

ఈ వేడుకలకు ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మ పాటలు, ఆటలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. తల్లిదండ్రులు సైతం వేడుకల్లో పాల్గొని కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి వేడుకల ద్వారా భావితరాలకు మన సంస్కృతి గొప్పతనాన్ని పరిచయం చేయడంతో పాటు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతా భావం పెంపొందుతాయని పేర్కొన్నారు.పాఠశాల డైరెక్టర్ శ్రావ్య రెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు మన పండుగలు, సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను విద్యార్థులకు పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో సుర్మౌంట్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సల్లా ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి,నాని, మణి,పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి కుంటలో నీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకర్ ద్వారా స్థానికులకు నీటి సరఫరా చేసిన డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్

చిలుకానగర్, అక్టోబర్ 10 ( మన మీ వార్త):







చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరి కుంట ప్రాంతంలో స్థానికులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ చిలుకానగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ తక్షణ చర్యలు చేపట్టారు. స్థానికులు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను తెలుసుకున్న ఆయన, సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

కుమ్మరి కుంట ప్రాంతంలో నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు తమ సమస్యను రాజేష్ ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) మేనేజర్ కిష్టయ్యతో మాట్లాడి, వెంటనే వాటర్ ట్యాంకర్ను ఏర్పాటు చేయించారు. దీంతో ట్యాంకర్ ద్వారా స్థానికులకు నీటిని అందించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణమే స్పందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. తమ నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే వాటర్ ట్యాంకర్ను ఏర్పాటు చేసి నీటిని అందించిన ములకలపల్లి రాజేష్ ముదిరాజ్కు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ మేనేజర్ కిష్టయ్యకు, లైన్మన్ సిద్ధి రాములుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు అమరేశ్వరి పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు 12 రోజుల సెలవులు

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

- లబ్ధిదారులకు ముందస్తుగానే టేక్ హోమ్ రేషన్ పంపిణీకి అనుమతి

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు 12 రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవుల కాలంలో లబ్ధిదారులకు సాధారణంగా అందించే వేడి భోజనం (హాట్ కుక్డ్ మీల్)కు బదులుగా టేక్ హోమ్ రేషన్ (ఠ=) పంపిణీ చేయడానికి అనుమతి ఇచ్చారు. అక్టోబర్ 22వ తేదీ నుంచి రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి. ఈ మేరకు తమ పరిధిలోని అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, హెల్పర్లకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారులు (ఐఔం), శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (జణూం)ను శాఖ ఆదేశించింది.


OFFICE OF THE DIRECTOR, WOMEN DEVELOPMENT AND CHILD WELFARE DEPARTMENT, TELANGANA STATE HYDERABAD.

Memo.No.5076/ICDS-1/2018, Dt: 09.10.2026.

Sub: WD&CW Dept. - ICDS - Dussehra holidays to all AWCs from 10.10.2026 to 21.10.2026 - Issue THR instead of hot cooked meal - Certain instructions issued - Reg.

Ref: 1. Representation received from Anganwadi Teachers & Helpers.
2. Note approval of the Director, WC&CW Dept, Hyderabad, dt:09.10.2026.

@@@@@

Attention is invited to the subject and reference cited.

Vide reference cited, representation received from the Anganwadi Teachers & Helpers requesting to declare the holidays to all AWCs in the State on the occasion of Dussehra from 10.10.2026 to 21.10.2026 (12 days).

In view of the above, permission is hereby accorded for sanction of Dussehra Holidays to all the Anganwadi Teachers & Helpers from 10.10.2026 to 21.10.2026 (12 days) permitted for issue THR instead of Hot cooked meal to the beneficiaries for above said days, AWCs will be reopen functioning normally from 22.10.2026.

Hence, the DWOs and CDPOs are directed to issue instructions to the Supervisors, AWTs and AWHs working under your jurisdiction.

Joint Director (ICDS)

To
All the CDPOs in the State.
All the DWOs, WCD&SC Dept. with similar instructions.
Copy to RJDs, Hyderabad & Warangal to pursue the matter.
Copy to SNP, Poshan Abhiyaan & IT Sections of this office.
Copy submitted to the Secretary to Govt., Dept. for WCD&SC for information.
Soft copy kept in mail.

ప్రభుత్వ స్కూల్ టీచర్ల మాదిరిగానే తమకు బతుకమ్మ, దసరా సెలవులు మంజూరు చేసినందుకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అంగన్వాడీ చరిత్రలోనే మొదటిసారిగా దసరా సెలవులు ఇచ్చి అంగన్వాడీ టీచర్స్ ని హెల్పర్స్ ని బతుకమ్మ సంబరాలు సంబరంగా చేసుకోమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఇంద్ర ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐ ఎన్ టి యు సి రాష్ట్ర అధ్యక్షురాలు డి అన్నపూర్ణ.

# జనగామ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి







- జనగామ మండలంలోని షామీర్పేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

జనగామ మండలంలోని షామీర్పేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ సందర్శించి, ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు.

కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, పారదర్శకంగా ధాన్యం సేకరించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో తేమ శాతం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, డీటీ సీఎస్ లు, గ్రామ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## వరంగల్ గ్రీన్ మార్కెట్ గుమస్తల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సుంచు జగదీశ్వర్ ను అభినందించిన తూర్పుకోట బతుకమ్మ దసరా ఉత్సవ కమిటీ బృందం

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



తూర్పు కోట : ఆసియాలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయినా వరంగల్ వ్యవసాయ మార్కెట్ గుమస్తాల సంఘం ఎన్నికలు శుక్రవారం జరగగా ఆ ఎన్నికల్లో కిలా వరంగల్ తూర్పు కోట వాస్తవ్యులు సుంచు జగదీశ్వర్ అధ్యక్షులుగా ఎన్నికైనందున ఖిల్లా వరంగల్ తూర్పు కోట బతుకమ్మ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేయడం అలాగే వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

ఈ సందర్భంగా బతుకమ్మ దసరా ఉత్సవ కమిటీ కన్వీనర్ మాజీ 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మార్కెట్లో గుమస్తాల సమస్యల మీద నిర్విరామంగా పోరాటం చేస్తూ ఎం సిపిఐ పార్టీ నాయకునిగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కమ్యూనిస్టు నాయకునిగా పేరు తెచ్చుకున్న తూర్పుకోట వాస్తవ్యుడు జగదీశ్వర్ గుమస్తాల సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా గెలుపొందడం అభినందనీయమని కొనియాడారు..

కార్యక్రమంలో తూర్పు కోట అఖిలపక్ష నాయకులు మరియు బతుకమ్మ దసరా ఉత్సవ కమిటీ ముఖ్య నాయకులు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు కరెంటు కోత మరియు మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ నుండి నీళ్ళు వదలకపోవడంతో ఆగ్రహించిన వంటేరు

తూప్రాన్/ మనోహరాబాద్ అక్టోబర్ 10 మన మీ వార్త ప్రతినిధి :



తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని నాగులపల్లి గ్రామంలో కొండపోచమ్మ సాగర్ మల్లన్న సాగర్ లో నీళ్లు ఉన్న రైతులకు సాగునీరు అందించక, రైతులకు కరెంటు ఇవ్వకపోవడంతో ఎండిపోతున్న రైతు పంటలను



పరిశీలించి రైతులతో మరియు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కరెంటు కోతల ప్రభుత్వం రైతులను ఆదుకొని ప్రభుత్వం గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అన్నిటికీ కరువే అని ఎండిన పంటలను చూసి మండిపడ్డారు. రైతులకు నీరు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తానని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు.

## రాష్ట్ర ప్రజలందరికీ ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు.

- తెలంగాణలో ప్రకృతిని దైవంగా భావించి పూజించే ఏకైక గొప్ప పండుగ బతుకమ్మ.
- ఇప్పకాయల రాణి, సింధు, భవ్య శ్రీ, హుజురాబాద్ ఎస్ బి కిడ్స్ వేర్.

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి అక్టోబర్ 10 :



ప్రకృతిని దైవంగా భావించి పూజించే ఏకైక గొప్ప పండుగ బతుకమ్మ, తంగేడు, గునుగు, చామంతి పూల సింగిడి, మన తెలంగాణ ఆడపడుచుల సంబరం బతుకమ్మ పండుగ అని ఇప్పకాయల రాణి, సింధు, భవ్య శ్రీ, అన్నారు. అలాగే వారు మాట్లాడుతూ, తొమ్మిది



రోజుల పాటు సాగే ఈ ప్రకృతి ఆరాధన మహోత్సవం గుమ్మడి, తంగేడు పూల రంగుల వలే మీ జీవితం ఎల్లప్పుడూ వర్ణశోభితంగా, సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తూ, ఎంగిలి పూల బతుకమ్మ. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ, కుటుంబ సభ్యులందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, సంతోషాలను పంచుకుంటూ జరుపుకునే ఈ బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో ఐక్యతను, ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యా లతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, ఇప్పకాయల రాణి, సింధు, భవ్య శ్రీ లు ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు.

## బతుకమ్మ మరియు దసరా ఉత్సవాల ఏర్పాట్ల పనులను పరిశీలించిన

- మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్
- కమిషన్ పోతారాజు పవన్
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలి

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



పరకాల పట్టణ కేంద్రంలో మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఆడుకునే అంగడి మైదానాన్ని,బతుకమ్మలు వేసే దామరచెరువు వద్ద చేయవలసిన ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. మరియు దసరా ఉత్సవాల సందర్భంగా బొడ్రాయి ప్రాంతాన్ని గడి ప్రాంతాన్ని మరియు రథాన్ని తీసుకుపోయే చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ చేయవలసిన పనుల గురించి మున్సిపల్ అధికారులతో చర్చించి తగు సలహాలు సూచనలు ఇచ్చి, అట్టి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మరియు మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ .ఇట్టి కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాలరాసే చర్యలను వెంటనే నిలిపివేయాలి

(మన మీ వార్త న్యూస్) అక్టోబర్ 10, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):

ఓటు హక్కును కాలరాసే చర్యలను వెంటనే నిలిపివేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్? చేశారు. యూత్? కాంగ్రెస్?, ఏఐఎస్?ఎఫ్, ఎన్?ఎస్?యూఐ, ఏఐపీఎస్?యూ, పీడీఎస్?యూ, ఏఐవైఎఫ్?, ఆర్?వైఎఫ్? ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్? చౌరస్తా వద్ద ఎన్నికల కమిషనర్? జ్ఞానేష్?కుమార్? దిష్టిబొమ్మను దహనం చేశారు.

**ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యలు**

ఏఐఎస్?ఎఫ్? రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురాం నాయక్ మాట్లాడుతూ, భారతదేశానికి ప్రజాస్వామ్యం ప్రాణవాయువు అయితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు వెన్నెముక లాంటిదని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతోందన్నారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయనే ఆరోపణల పేరుతో విచక్షణారహితంగా ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం సరైన విధానం కాదన్నారు. అంతేకాకుండా తాతలు, ముత్తాతల గుర్తింపు పత్రాలు సమర్పించాలని కోరడం సాధారణ ప్రజలను అనవసర ఇబ్బందులకు గురిచేసే చర్య అని అన్నారు.




**రాజీనామా చేయాలి**

ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్?ఎఫ్?ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, ఏఐపీఎస్?యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఎన్?ఎస్?యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, పీడీఎస్?యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్, ఏఐఎస్?ఎఫ్? జిల్లా అధ్యక్షుడు సుభోద్, ఏఐవైఎఫ్? జిల్లా కార్యదర్శి రంజిత్, ఆర్?వైఎఫ్? జిల్లా కార్యదర్శి పిట్ల నరేష్, అలాగే అనిల్, సన్నీ, గోపాల్ సింగ్ ఠాగూర్, రాజు పాల్గొన్నారు.

# ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకారుల పై పోలీసుల లాఠీఛార్జ్, అక్రమ అరెస్టులను ఖండిస్తూ

- జవహర్ నగర్లో సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తీవ్ర నిరసన

జవహర్ నగర్ , అక్టోబర్ 10 (వార్త ప్రతినిధి) :

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వామపక్ష, విపక్ష, విద్యార్థి మరియు యువజన సంఘాల నాయకులపై పోలీసు బలగాలు జరిపిన లాఠీఛార్జ్, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ శనివారం రోజున జవహర్ నగర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

ప్రధాన డిమాండ్లు

**సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా:** ఎన్నికల



సంఘంలో ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**సర్ రద్దు చేయాలి:** ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన (సర్ ) ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని కోరారు.

ఓట్ల తొలగింపుపై ఆగ్రహం: దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ప్రజల ఓట్లను తొలగించడానికి కుట్రలు జరుగుతున్నాయని, అందులో ప్రధానంగా ఆదివాసీలు, దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు ఇతర మైనార్టీ వర్గాల ప్రజల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు.

**శాంతియుత నిరసనలపై అణచివేత:** కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పోలీసులు శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును కాలరాస్తూ లాఠీఛార్జ్ చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. హక్కుల పరిరక్షణ కోసం, ఓటు హక్కును కాపాడుకోవడం కోసం దేశవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ, నాయకులు, నిమ్మల నరసింహులు, సిహెచ్ దశరథ, దర్శనం యాదగిరి, ఎల్లయ్య, మల్లికా,కిరణ్, ప్రజా సంఘాల నాయకులు, షేక్షావలి, సదానందం బి ప్రవీణ్ స్వరూప శివ బాబు జయసుధ మల్లేష్ సునీత కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హబ్సిగూడ రెడ్డి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

హబ్సిగూడ, అక్టోబర్ 10 ( మన మీ వార్త):

హ్యాబ్సిగూడ రెడ్డి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో రోడ్ నంబర్ 4లోని ప్రభుత్వ హోమియో వైద్యశాల ఎదురుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకునే పూల పండుగ బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తరతరాలుగా



కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా నిర్వాహకులు ఆకాంక్షించారు. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఆచార వ్యవహారాలను భావితరాలకు పరిచయం చేస్తూ, మన సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పాలని పేర్కొన్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మహిళలు, బాలికలు, వృద్ధులు అందరూ కలిసికట్టుగా పాల్గొని బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పూల పండుగ ద్వారా మహిళల్లో ఐక్యత, సోదరభావం,



ఆత్మీయత మరింత బలపడతాయని ఈ వేడుకలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హ్యాబ్సిగూడ రెడ్డి సంఘం మహిళా విభాగం నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను సమష్టిగా నిర్వహిస్తూ, వాటి విశిష్టతను భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు.

# ఉప్పల్ భగాయత్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు



- ప్రకృతి పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేసిన మహిళలు

ఉప్పల్, అక్టోబర్ 10 ( మన మీ వార్త):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు ఉప్పల్ భగాయత్‌లో అంబరాన్నంటాయి. ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూల పండుగను



ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. బతుకమ్మ పండుగలో తొలి రోజుగా భావించే ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా మహిళలు వివిధ రకాల ప్రకృతి సిద్ధమైన రంగురంగుల పూలను సేకరించి, వాటిని అందంగా పేర్చి బతుకమ్మలను రూపొందించారు. సంప్రదాయ పద్ధతిలో పేర్చిన బతుకమ్మలు ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. ఆటపాటలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రకృతితో మానవ సంబంధాన్ని చాటిచెబుతుందని, పూల ప్రాధాన్యతను



తెలియజేస్తుందని మహిళలు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల ఐక్యతకు, సామూహిక సాంస్కృతిక స్ఫూర్తికి ప్రతీకగా నిలిచాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబరాలు రానున్న రోజుల్లో మరింత వైభవంగా కొనసాగనున్నాయి.

## వెంపటి నరసయ్య--శకుంతల జ్ఞాపకార్థం అన్నదానం

మీ వార్త అక్టోబర్ 10 సూర్యాపేట జిల్లా ప్రతినిధి :

- సూర్యాపేటలో 400 మందికి అన్నదాన కార్యక్రమం



**సూర్యాపేట జిల్లా కేంద్రం:** వెంపటి నరసయ్య, శకుంతల గార్ల జ్ఞాపకార్థం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్ గేట్ ఎదురుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 400 మందికి అన్నదానం చేశారు. దివంగతుల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం, సేవాభావాన్ని చాటుకోవడం గొప్ప విషయమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంపటి వెంకటేశ్వర్లు, యాదగిరి, కృష్ణమోహన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం




# నేటినుండి వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా భక్తి ప్రపత్తులతో జరుపబడే శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవము







మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

ఈ రోజు అనగా దీవి 10-10-2026 శనివారం రోజున అంకురార్పణ జరిగినది. ఈ రోజు ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన పిమ్మట జగత్ప్రసూతికా అలంకారం జరిపి భక్తులకు అమ్మవారి హరిద్రా దర్శనాన్ని జరిపారు. భక్తులు సమర్పించిన 27 కిలోల స్వచ్ఛమైన హరిద్రా (పసుపు) చూర్ణంతో అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. అతంకుముందు పూజారులు వైదికమైన క్రతువు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం జరిపి హరిద్రామయమైన అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. సాయంకాలం వరకు భక్తులందరూ దర్శించుకునే విధంగా అవకాశం కల్పించారు. అనంతరం అంకురార్పణ జరిగినది. పసుపుమయమై ఉన్న అమ్మవారిని దర్శించిన భక్తులు ఈ రోజు తమకు కలిగిన ఆనందానుభూతిని మాటల్లో వర్ణించలేమని తెలిపారు. జగత్ప్రసూతికా అలంకారం హరిద్రా దర్శనం నేపథ్యాన్ని శ్రీ భద్రకాళి శేషు భక్తులకు వివరిస్తూ-

**సర్వస్యాద్యా మహాలక్ష్మీ స్త్రిగుణా పరమేశ్వరీ**

**లక్ష్మా లక్ష్యస్వరూపా సా న్యాప్య కృత్స్నం వ్యవస్థితా**

కార్యప్రపంచమునకన్నా అవతారములన్నిటికన్ననూ ప్రారంభమున వున్నది మహాలక్ష్మియే. ఆమె నుండియే మహాకాళి, మహాసరస్వతీ, దేవతలు ఆవిర్భవించగా ఈ త్రిశక్తులు మూడు మిధునములను సృష్టించారు. వీళ్ళు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దంపతులు, వీరు సృష్టి, స్థితి, సంహార కారకులు, ఈ జగత్తంతా వీరి నుండి ఉత్పన్నమై పెంచబడి, రక్షింపబడి లయింపబడుచున్నది. క్రమక్రమముగా సమస్త బ్రహ్మాండము వీరి నుండియే ఆవిర్భవించింది. అనగా జగన్మాత మహాలక్ష్మి నుండియే సమస్త బ్రహ్మాండము ఆవిర్భవించినది. కావుననే రేపటి నుండి జరుపబడే దుర్గా శరన్నవరాత్రులకు ముందు రోజయిన అమావాస్యనాడు శృంగేరీ శారదాపీఠంలో అమ్మవారికి జగత్ప్రసూతికా అలంకారమని పసుపుతో జరుపుతారు. అంటే అమ్మవారు ఈ జగత్తును ప్రసవించినది అని అర్థం. ప్రసవానంతరం స్త్రీకి పసుపు ముద్ద లేపనం జరిపి స్నానం జరుపుతారు. దానికి ప్రతీకగా అమ్మవారికి హరిద్రా లేపనం చేసి భక్తులు దర్శించిన పిమ్మట అభిషేకం జరుపడం అని శేషు తెలిపారు.

అమావాస్య తిథికి అధిదేవతలు పితరులు. ఏ శుభకార్యాన్ని జరుపడానికి ముందుగా నాందీ సమారాధన అని జరుపుతారు. దాన్నే నాంది పలకడం అని అంటారు. దేవయజనానికి ముందుగా సవ్యంగా పితృయజ్ఞాన్ని జరుపడమే నాందీ. దేవతలకిచ్చు హవ్య స్వరూపము పితృదేవతలకిచ్చు కవ్య స్వరూపము ఆ జగన్మాతయే. అనగా పితృదేవతలు అధిదేవతలైన అమావాస్య తిథికి కూడా అధిదేవత స్వధా రూపమైన ఆ జగన్మాతయే. కనుక ఈ రోజును అగన్మాతను ఆరాధించడం వల్ల పితృశాపాలు తొలగిపోయి పితృదేవతల అనుగ్రహం కూడా లభిస్తుంది. కావుననే భాద్రపద బ॥ అమావాస్య రోజున అనేక మంది భక్తులు అమ్మవారిని దర్శిస్తారు. ఈ రోజు పసుపుతో అలంకరింపబడిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఒక అనిర్వచనీయమైన అనందానుభూతిని పొందారు. అనంతరం వాస్తు యాగం, పర్యగ్నికరణం జరుపబడి సాయంకాలం అంకురార్పణ జరుపబడినది. రేపు ఉదయం గం॥ 4-00లకు అమ్మవారికి పూర్ణాభిషేకంతో పరాభవ నామ సంవత్సర దేవీశరన్నవరాత్రులు ఆలయంలో ప్రారంభమైతాయి.

రామల సునీత కార్యనిర్వహణాధికారి.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ

- దసరా సెలవుల్లో 10 రోజుల ఇంటర్న్‌షిప్

కాసిపేట, అక్టోబర్ 10 (మన మీ వార్త మండల ప్రతినిధి) :

విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలకు అవసరమైన ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కాసిపేట తెలంగాణ మోడల్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల్లో భాగంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థులకు సోమగూడెంలోని శ్రీరామ టీవీ రిపేర్ సర్వీసెస్, శ్రీ సాయి ఈశ్వర ఎలక్ట్రానిక్స్ అండ్ రిపేర్ సెంటర్లలో పది రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు.

తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ అధికారుల ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. వృత్తి విద్యా శిక్షకురాలు గడప సంధ్య పర్యవేక్షణలో విద్యార్థులు వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతు, వినియోగంలో మెళకువలను నేర్చుకుంటున్నారు. టీవీ, ఫ్యాన్, సింగిల్ ఫేజ్ మోటార్, కూలర్, మిక్సర్ గ్రైండర్ తదితర పరికరాల పనితీరు, మరమ్మతులపై ప్రాయోగిక శిక్షణ పొందుతున్నారు.





రాష్ట్రంలోని మోడల్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులను కూడా అందిస్తున్నారని ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు. శిక్షణ పూర్తయిన అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన డేటా ప్రో ఏజెన్సీ, వృత్తి విద్యా సమన్వయకర్త ఉపేంద్రతో పాటు శిక్షణకు సహకరిస్తున్న రిపేర్ సెంటర్ల నిర్వాహకులు బండారి రాజేందర్, కొండా రాజశేఖర్‌లకు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, శిక్షకురాలు గడప సంధ్య, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



నాచారం, అక్టోబర్ 10 ( మన మీ వార్త):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలో అంబరాన్నంటాయి. రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, ఇంద్ర నగర్ కాలనీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకలు కాలనీల్లో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సందర్భంగా రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, ఇంద్ర నగర్‌లలో నిర్వహించిన పలు బతుకమ్మ వేడుకల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు యోగేశ్వర్, రెడ్డి, రామకృష్ణ,



సోమయ్య, శశిసాయి, గందమల్ల గోపి, రాజిరెడ్డి, రమేష్, సురేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

# హబ్సీగూడ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కంది శ్రవణ్ రెడ్డి

- హబ్సీగూడ రెడ్డి సంఘం, కాకతీయ నగర్ హౌసింగ్ సొసైటీల ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి

హబ్సిగూడ, అక్టోబర్ 10 ( మన మీ వార్త ):

బతుకమ్మ సంబరాల్లో తొలి రోజైన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు హబ్సీగూడ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్, కాకతీయ నగర్ హౌసింగ్ సొసైటీల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మహిళలు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

హబ్సీగూడ రెడ్డి అసోసియేషన్ సభ్యులు రమాదేవి, వరుణ్, కాకతీయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ధర్మ రాజు ల ఆహ్వానం మేరకు బతుకమ్మ





వేడుకలకు ముఖ్య అతిథిగా హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఆయనకు కమిటీ సభ్యులు శాలువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. హబ్సీగూడ డివిజన్ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయం ధర్మకర్త విపిన్ అగర్వాల్, ఉప్పల్ ఎ బ్లాక్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, హబ్సీగూడ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు నాయక్, గుంటి సాయి కుమార్, సుమన్ నాయక్, కాకతీయ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు, హబ్సీగూడ రెడ్డి సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొంగిపొర్లుతున్న డ్రైనేజ్ నీరు పట్టించుకోని అధికారులు ప్రజా పాలనలో" శూన్యం"

జవహర్ నగర్ అక్టోబర్ 9 (వార్త ప్రతినిధి) :



జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన పరిధిలో వైఎస్ఆర్ నగర్ కాలనీలో డ్రైనేజ్ లీకేజ్ అవస్థ పడుతున్న కాలనీవాసులు గత కొన్ని రోజులుగా డ్రైనేజ్ నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడింది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మురుగునీటి దుర్వాసనతో ఇండ్లలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి దీంతో మలేరియా డెంగు టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రభావం ప్రమాదకరంగా ఉండవచ్చు స్థానికులు ఆందోళన చెందుతున్నారు ముఖ్యంగా చిన్నపిల్లలు వృద్ధులు ఈ కాలుష్యం కారణంగా అనారోగ్యం బారిన పడవచ్చు ఈ ప్రాంతంలో శానిటైజర్ గాని సిబ్బంది అసలు పట్టించుకోవడం లేదు అని విమర్శలు వినిపిస్తున్నాయి

పట్టించుకోని అధికారులు ఈ సమస్యపై స్థానిక మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు పలుమార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ పైపులు బ్లాక్ అయిన తొలగించి శాస్త్ర పరిష్కారం చూపాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

# రైతులు సహకరిస్తే సకాలంలో పూర్తి.

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



భూపాలపల్లి జయశంకర్ జిల్లా రైతులు భూముల సర్వేకు సహకరిస్తే సర్వే సకాలంలో పూర్తయి రైతుల సమస్యల పరిష్కారానికి వీలవుతుందని అధికారులు తెలిపారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని చెన్నాపురం గ్రామంలో గత కొద్ది రోజులుగా భూముల సర్వే కొనసాగుతుంది. చిన్నపురం గ్రామంలో ఎక్కువ భూములు పట్టాలు కాకుండా ఉన్నాయని రైతులు సహకరిస్తే వాటి సర్వే పూర్తి చేసి పై అధికారులకు నివేదిక సమర్పించడం జరుగుతుందని అధికారులు రైతులకు తెలిపారు. సర్వేలో పాల్గొన్న అధికారులకు రైతులు భూముల వద్దకు పట్టా పాస్ పుస్తకాలతో రావాలన్నారు. రైతుల పంట పొలాలకు సంబంధించిన హద్దులు నిర్ణయించి క్షేత్రస్థాయిలో ఏ రైతులు ఉన్నారనే విషయాన్ని సర్వేలో చేర్చడం జరుగుతుందని అధికారులు తెలిపారు. సర్వేకు వచ్చిన అధికారులతో రైతులు మమేకమై భూముల సర్వేకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. సర్వేలో భాగంగా సర్వేయర్ చంద్రమౌళి , జె పి ఓ సి హెచ్ రమేష్ సభ్యులు వినయ్ తోపాటు రైతుల పాల్గొన్నారు.

# నేటి నుండి వైభవంగా అష్టబుజ వేణుగోపాలస్వామి తొమ్మిది రోజుల రథోత్సవాలు

లక్ష్మన్ చందా, అక్టోబర్ 10(మన మీ వార్త) :





మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ అష్టబుజ వేణుగోపాలస్వామి ఆలయంలో రేపటి నుండి తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా వార్షిక రథోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ప్రారంభం కానున్నాయి.



ఈ తొమ్మిది రోజుల పాటు స్వామివారు ప్రతిరోజూ వివిధ రకాల విశేష అలంకారాలలో, ప్రత్యేక వాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వడం జరుగుతుంది.

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో భక్తులు, గ్రామస్తులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి రథోత్సవాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆ అష్టబుజ వేణుగోపాలస్వామి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ధర్మకర్తలు భక్తిపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

## వరంగల్లో తొలి ఎంగిలిపూల బతుకమ్మ

మన మీ వార్త అక్టోబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా శ్రీ దుర్గేశ్వర స్వామి దేవాలయంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి.....

## ఆత్మకూరులో ఘనంగా బతుకమ్మ సంబరాలు:

– పాల్గొన్న హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలి

పరకాల ప్రతినిధి మన మీ వార్త :

**హనంకొండ జిల్లా ఆత్మకూరు:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ఉత్సవాలు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయక పాటలతో ఆడుతున్న ఉత్సవాల్లో ఆయన కాసేపు గడిపారు. అనంతరం గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ మరియు దసరా పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.

**ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ:**

"తెలంగాణ అస్తిత్వానికి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ఒక నిదర్శనం. ప్రకృతిని పూజించే ఇలాంటి గొప్ప పండుగను మనమంతా కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషకరం. ఆత్మకూరు ప్రజల జీవితాల్లో ఈ బతుకమ్మ పండుగ సరికొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇల్లూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి పర్వతగిరి మహేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శాయంపేటలో రావణ వధ ఉత్సవాలకు పోస్టర్ ఆవిష్కరణ



పరకాల ప్రజలు మన మీ వార్త :

**హనంకొండ జిల్లా శాయంపేట, అక్టోబరు 10:**శాయంపేట మండల కేంద్రంలో రావణ వధ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ ఉమా రవిపాల్, రావణ వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సామల గ్రౌండ్‌లో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై కమిటీ సభ్యులు చర్చించారు.ఈ నెల 20న బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శాయంపేటలోని సామల గ్రౌండ్‌లో రావణ వధ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిందం సాయికుమార్, ఉపాధ్యక్షుడు బసాని అఖిల్, ప్రధాన కార్యదర్శి బసాని సాయి తేజ, కార్యదర్శి చెల్పూరి బంటి ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్ , బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నరహరి శెట్టి రామకృష్ణ, మత్స్యగిరి స్వామి టెంపుల్ చైర్మన్ సామల బిక్షపతి , అర్చకులు కృష్ణమాచార్యులు, గౌరవ వార్డు సభ్యులు,పరిమల్ల నోము లేశ్వ ర్, కొత్తపల్లి రవీందర్, ఉప్పు రంజిత్, రాయారకుల సుమన్, దైనంపెల్లి అరుంధతి, రావణ వధ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పూల సింగిడిలో బతుకమ్మ సంబరాలు..

– పట్టణంలో మహిళల ఆటపాటల సందడి..



పరకాల ప్రతినిధి మన మీ వార్త :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పండుగలో తొలి రోజైన ఎంగిలిపూల బతుకమ్మను పట్టణంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, ఒకచోట చేరి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు. మహిళల ఉత్సాహం, పూలతో అలంకరించిన బతుకమ్మలతో పండుగ శోభ నెలకొంది.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తరతరాలుగా కొనసాగిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

# ప్రజా వ్యతిరేకతను బేఖాతరు చేస్తున్న ఎక్సైజ్ శాఖ

**రేణిగుంట:** ప్రత్యేక ప్రతినిధితిరుపతి జిల్లా రేణిగుంటలో ప్రజల ప్రాణాలతో, మహిళలు, విద్యార్థుల భద్రతతో ఎక్సైజ్ శాఖ చెలగాటమాడుతోంది. జనావాసాలు, పవిత్ర ప్రార్థనా స్థలాలు, బడులు, బస్టాప్‌లకు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన 'ఆద్య వైన్స్', 'సర్వేశ్ వైన్స్' మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, మహిళా సంఘాలు భగ్గుమంటున్నాయి. అయితే, ప్రజా ఆగ్రహాన్ని, మహిళల ఆవేదనను కనీసంగా కూడా పరిగణనలోకి తీసుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు.. "నిబంధనల ప్రకారమే వైన్ షాపులు నడుస్తున్నాయి" అంటూ బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం పట్ల సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.?తొమ్మిది రోజులుగా ఆందోళ నలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం.. రేణిగుంట పాంచాలినగర్ ప్రాంతంలో వెలిసిన ఈ మద్యం దుకాణాల వల్ల నిత్యం మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగుబోతుల బెడదతో ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, అసాంఘిక కార్యకలాపాలకు ఈ దుకాణాలు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ దుకాణాలను తక్షణమే ఊరి బయటకు తరలించాలని కోరుతూ స్థానికులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా రోడ్డు ఎక్కి నిరసనలు, ధర్నాలు చేస్తున్న.. ప్రభుత్వంలో స్పందన కరువైంది. గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుతో తంతు తూతూ మంత్రంగా విచారణ...ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో సెప్టెంబర్ 28న తిరుపతి జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్లులో బాధితులు స్పష్టమైన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై శనివారం ఉదయం ఎక్సైజ్ సీఐ ఏలూరు నరసానాయుడు బృందం విచారణకు దిగింది. ఈ సందర్భంగా స్థానికులు మునస్వామి రాయుడు శివప్రసాద్



ప్రసన్నలక్ష్మి తదితరులు మద్యం దుకాణాల వల్ల జరుగుతున్న అనర్థాలను అధికారుల ముందు పూస గుచ్చి వివరించారు.నిబంధనల ముసుగులో వైన్ షాపుల తొలగింపునకు ఎసరు...మహిళల భద్రతను ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేసి ఎక్సైజ్ నిబంధనల ప్రకారమే దుకాణాలున్నాయి. అంటూ అధికారులు చెబుతున్న మాటలు వింటే వారికి ప్రజల ఆరోగ్యం కంటే వ్యాపారుల ప్రయోజనాలే ముఖ్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనావాసాల మధ్య బడులు గుడుల పక్కనే మద్యం దుకాణాలు ఉంటే నిబంధనలు ఎలా సంక్రమవుతాయని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న ఈ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని లేనిచో ప్రజా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి సిపిఎం నాయకులు వెంకటరమణ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ సిఐటియు మండల కన్వీనర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆ మద్యం దుకాణాలను అక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# బస్టాండులో వ్యాపారాల జోరు..

**ప్రయాణికులకు నరకం**

**అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల ఆగ్రహం.**

**వనపర్తి :** నాలుగు దశాబ్దాలైనా మారని వనపర్తి బస్టాండ్ తీరు.పండుగ వేళ బస్సుల కోసం పడిగాపులు.. పట్టించుకోని అధికారులు.చెత్తాచెదారం మధ్యే ప్రయాణాలు.. అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆగ్రహనీ.బస్టాండులో వ్యాపారాలకు ఇచ్చే ప్రాధాన్యం ప్రయాణికుల సౌకర్యాలకు ఏదీ? ఆదాయం మీద ఉన్న శ్రద్ధ.. ప్రయాణికుల ఇబ్బందులపై ఎందుకు లేదు? నాలుగు దశాబ్దాలు గడిచినా వనపర్తి ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు మారకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దసరా పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు పడుతున్న అవస్థలు చూసి చలించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శనివారం బస్టాండ్ పరిసరాలను పరిశీలించి అధికారుల తీరుపై మండిపడ్డారు. బస్సుల్లేవు.. సౌకర్యాల్లేవు!జిల్లా కేంద్రం నుంచి నిర్ణీత సమయానికి బస్సులు నడపలేని దుస్థితి నెలకొందని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిపోలో సరిపడా బస్సులు లేక ప్రైవేట్ బస్సులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పండుగ



సమయంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బస్సుల నిర్వహణలో లోపాలు, ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు.చెత్త కుప్పల మధ్య ప్రయాణమా బస్టాండ్ పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయినా శుభ్రతపై అధికారులకు పట్టింపు లేకపోవడం దారుణమని సతీష్ యాదవ్ విమర్శిం చారు. అపరిశుభ్ర వాతావరణం ప్రయాణికుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాం డ్‌ను పరిశు భ్రంగా ఉంచడంతోపాటు తాగునీరు, కూర్చునే వసతి తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.

# కవులు ఏ పుస్తకం రాసినా అచ్చు వేయించి ప్రచురించే బాధ్యత నాది

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు**

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక విపంచి కళా నిలయంలో ఘనంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట సాహిత్య వైభవం, స్వరాష్ట్రంలో సాధించిన గుణాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ హరీశ్ రావు ప్రసంగించారు. హరీశ్ రావు మాట్లాడుతూజీవితం శాశ్వతమైనది కాదు ఈ సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయేది అక్షరాలు, మనం చేసే మంచి పనులు మాత్రమే.కవులు ఏ పుస్తకం రాసినా సరే, దాన్ని స్వయంగా అచ్చు వేయించి ప్రచురించే పూర్తి బాధ్యతను నేను తీసుకుంటాను.సిద్దిపేటకు ఒక ప్రత్యేకత ఉంది.. ఈ రాష్ట్రంలో గానీ, దేశంలో గానీ అవార్డుల జాబితా ఉంటే అందులో సిద్దిపేట పేరు లేకుండా అవార్డే ఉండదు.అభివృద్ధి, హరితహారం, విద్య, వైద్యం, స్వచ్ఛతలోనే కాకుండా సాహిత్య రంగంలోనూ నంది పురస్కారం నుంచి జాతీయ సాహిత్య అకాడమీ వరకు సిద్దిపేటకు నిరంతరం అవార్డులు వస్తున్నాయిఒకప్పుడు ఎన్నికలు వస్తే గోడల మీద నినాదాలు మాత్రమే కనిపించేవి.. గెలిపిస్తే సిద్దిపేట జిల్లా చేస్తాం, గోదావరి జలాలు తెస్తాం, రైలు రప్పిస్తాం అని దశాబ్దాలుగా రాతలుగా మిగిలిన కలలన్నీ స్వరాష్ట్రంలో నేడు మన కళ్ల ముందే సాకారమైన నిజాలు.ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ విద్యా, వైద్యం, మౌలిక వసతులు, పచ్చదనం, సాగు, తాగునీటి రంగాల్లో సమగ్ర గుణాత్మక మార్పును తీసుకొచ్చాం.నేను కొత్తగా ఎమ్మెల్యే అయిన నాడు సిద్దిపేటలో కేవలం 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే పండేది నేడు గోదావరి జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పుణ్యమాని సాగు విస్తీర్ణం పెరిగి 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోంది.ఆయిల్ పామ్ పంట అంటే ఏంటో తెలియని మన ప్రాంతంలో నేడు విరివిగా ఆయిల్ పామ్ తోటలు విస్తరించి రైతులు అధిక లాభాలు గడిస్తున్నారు. గతంలో తిరుపతికో, ఆంధ్ర ప్రాంతానికో, హైదరాబాద్‌కో



వెళ్తేనే మనకు రైలు కనిపించేది మన ప్రజలకు రైలు అంటేనే తెలిసేది కాదు అలాంటిది నేడు రైలు మార్గం సిద్దిపేటకు వచ్చింది.రాబోయే కొద్ది రోజుల్లోనే రైల్వే విద్యుదీకరణ పూర్తయితే ప్రతి అరగంటకు ఉత్తర భారతానికి రైళ్లు నడిచే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయి.ఈ అభివృద్ధి అంతా సిద్దిపేట మట్టి గొప్పతనం, ప్రజల గొప్పతనం అందుకే ఈ పదేళ్ల ప్రగతి పండుగను సిద్దిపేట ప్రజలకే సగర్వంగా అంకితం చేస్తున్నాం.

# మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీని మొగాంబోగా అభివర్ణిస్తూ– ఆయన భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి చేసిన నేరాలకు ప్రధాని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడంతో పాటు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ విమర్శించారు. చెన్నైలో శనివారం యువతతో ఛాత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గళం) ఆరో ఎడిషన్ కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశ రాజధాని దిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ – నగరమంతా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోలీసులు విద్యార్థులపై దాడులు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ కూడా తన అనుచరుల ద్వారా విద్యార్థులపై దాడులు చేయించిందని విమర్శించారు.

'మోదీ సమస్య ఏంటంటే– ఆట ముగిసిపోయిందని ఆయన అర్థం చేసుకోవడం లేదు. గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది. దేశానికి చేసిన నేరాలకు మోదీ మూల్యం చెల్లించేలా మేం చేస్తాం'



ఇక్కడ రాహుల్ గాంధీ ప్రధానిని మొగాంబోతో పోల్చారు. ప్రముఖ బాలీవుడ్ చిత్రం మిస్టర్ ఇండియాలోని విలన్ పాత్ర పేరు మొగాంబో. దివంగత నటుడు అమ్రిష్ పురి పోషించిన ఆ పాత్రను ప్రస్తావిస్తూ మొగాంబో మోదీ అని అన్నారు. రాహుల్ దీని గురించి మాట్లాడే సమయంలో వెనుక స్క్రీన్‌పై 1987లో విడుదలైన మిస్టర్ ఇండియా సినిమాలోని దృశ్యాన్ని కూడా ప్రదర్శించారు. అందులో అమ్రిష్ పురి ముఖానికి బదులుగా మోదీ ముఖాన్ని మార్ఫింగ్ చేసి చూయించారు.

తమిళ సంస్కృతి, భాషపై మోదీ దాడి చేస్తున్నారు: రాహుల్

ఇక ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా– తమిళనాడు సంస్కృతి, భాష సహా చరిత్రపైనా దాడి ప్రారంభించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆరోపించారు. తమిళనాడుపై హిందీని రుద్దుతామని అమిత్ షా బహిరంగంగా చెబుతున్నారని విమర్శించారు. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ద్వారా 3 భాషల విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్నే అణచివేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. తమిళనాడును ఇంకా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ ద్వారా శిక్షించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

'తమిళ సంస్కృతి, భాష, చరిత్రపై మోదీ దాడి చేయడాన్ని మేం అనుమతించబోం. ఆయన తమిళనాడును ముట్టుకోలేరు' అని స్పష్టం చేశారు. తమిళనాడు నేలపైకి రావడం తనకు గౌరవంగా ఉందన్న రాహుల్, ఈ రాష్ట్ర ప్రజల నుంచి తాను తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటానని తెలిపారు. ఈ క్రమంలోనే తమిళనాడు సామాజిక సంస్కర్త పెరియార్ బోధనలను రాహుల్ గుర్తుచేశారు. ఇతరులు చెప్పారని ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి అంశాన్నీ విశ్లేషించి, ప్రశ్నించి తెలుసుకోవాలని పెరియార్ సూచించినట్లు చెప్పారు.

### విద్యార్థులు దేనికీ భయపడొద్దు

ఇక దేనికి భయపడవద్దనేదే విద్యార్థులకు తాను చెప్పదలుచుకున్న ప్రధాన సందేశం అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రశ్నించడం, ఆసక్తితో తెలియని విషయాలను తెలుసుకోవాలనుకోవడం సమాజ పురోగతికి పునాదులని, ప్రజాస్వామ్యం కూడా ప్రశ్నించే తత్వం నుంచే పుట్టిందని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. ఇక చెన్నైకి ముందు కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్ రాజ్, పుణె, ఇండోర్ నగరాల్లో ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమాలను నిర్వహించింది కాంగ్రెస్. ఈ కార్యక్రమం గురించి ఆ పార్టీ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ కూడా స్పందించారు. రాహుల్ చేపట్టిన ఈ కార్యక్రమం రాజకీయ వివాదాలకు పరిమితం కాకుండా, వ్యవస్థలో ఉన్న లోతైన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సాగుతోందని అన్నారు. ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దాంట్లో సమూల మార్పు తీసుకురావాలన్నదే రాహుల్ లక్ష్యమని పేర్కొన్నారు.

# నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు.



### దీక్షేను విమానంలోనే!

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీక్షేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి దిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

### కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

### వామపక్ష నేతలూ అదుపులోకి

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

### ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. "మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు" అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. "భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం" అని ఖర్గే తెలిపారు.

### మోదీ, షా నడుపుతున్న నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ

భారత్? ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ–అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. "మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు" అంటూ ఆరోపణలు చేశారు.

### సుప్రీంకోర్టులో విచారణ

దిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్?పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

## విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి కేసు నమోదు చేసిన ఎన్ఐఏ




దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం–2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)–1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం–2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది. ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్? నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్–సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్?పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్? తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న టబుక్‌లోని ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దుల్ అజీజ్ విమానాశ్రయానికి ఉదయం సుమారు 10.45 గంటలకు విమానం చేరుకుంది. అనంతరం దాడికి పాల్పడిన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్టు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం వెల్లడించింది.

## పాకిస్థాన్‌లో మరో దారుణం..



పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో దైవదూషణ ఆరోపణలతో ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయాయి. క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్–మార్నింగ్ స్టార్ న్యూస్ కథనం ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లోని షేఖుపురా జిల్లా, ఘరియల్ కలాన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామంలో ఫార్మసీ నడుపుతున్న కమ్రాన్ మసీహ్ (40) అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో దైవదూషణకు సంబంధించిన వీడియోను షేర్ చేశాడని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఈ ఆరోపణలతో గురువారం రాత్రి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే శుక్రవారం రోజున వందలాది మంది ముస్లింలు కమ్రాన్ దుకాణం, ఇంటి వద్ద గుమిగూడారు. కొద్దిసేపటికే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు వ్యక్తులు ఆ రెండు భవనాలకు నిప్పుపెట్టారు. కమ్రాన్ అరెస్టు, ఆస్తుల ధ్వంసం వార్త తెలియగానే, గ్రామంలోని ఇతర క్రైస్తవ కుటుంబాలు మూకదాడులు జరగవచ్చనే భయంతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కమ్రాన్‌పై దైవదూషణ చట్టంలోని ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రైస్తవుల ఆస్తులు, నివాసాలకు రక్షణ కల్పించేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు షేఖుపురా జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉన్నందున, దర్యాప్తు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

### దుర్వినియోగమవుతున్న దైవదూషణ చట్టాలు

పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు తరచూ దుర్వినియోగం అవుతున్నాయని, వ్యక్తిగత కక్షలు, తగాదాల కోసం వీటిని వాడుకుంటున్నారని మానవ హక్కుల సంఘాలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలే లక్ష్యంగా ఈ చట్టాలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన 333 దైవదూషణ కేసుల్లో చాలా వరకు తప్పుడువని ఇటీవల ఓ పార్లమెంటరీ కమిటీకి అధికారులు నివేదించారు. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌లోనే 116 కేసులు నమోదైనట్లు అధికారిక డేటా వెల్లడించింది. చాలా కేసుల్లో ఆరోపణలకు సరైన ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసినట్లు అధికారులు కమిటీకి తెలిపారు. దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, మైనారిటీలను రక్షించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని 'వాయిస్ ఆఫ్ పాకిస్థాన్ మైనారిటీ' వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.

## 'గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా'




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

### నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లే!

దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు. 'అసలు ఎలాంటి ఆధారాలు లేకుండా మన ఎన్నికలను రిగ్గింగ్ అంటూ ఒక పదాన్ని పదేపదే ఉపయోగిస్తున్నారు. ప్రతిసారీ అలా అనడం ప్రజాస్వామ్యంపై మనందరికీ ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది' అని లేఖలో పేర్కొన్నారు.

### గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా?

ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థ నిజాయతీగా ఉందని, అదే ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు, అవకతవకలకు పాల్పడిందని చెప్పడం సరికాదని మాజీ అధికారులు ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. 'వ్యవస్థపై మీకు అనుమానమా? లేక ఫలితంపైనా?' అని ప్రశ్నిస్తూ, తగిన ఆధారాలేం లేకుండా తప్పుడు కథనాలను ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు.

### బిహార్ ఎన్నికలే ఉదాహరణ!

ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా మాజీ అధికారులు పేర్కొన్నారు. బిహార్ చరిత్రలోనే తొలిసారిగా అక్కడ ఒక్క రీపోలింగ్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు లేఖలో గుర్తుచేశారు. అధికారులు పూర్తిగా మారిపోయినందువల్లే ఇది సాధ్యమైందని కాదని, ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలో పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ఇక ఈవీఎంలు, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత గురించి ప్రస్తావించిన మాజీ అధికారులు– ప్రతి అభ్యర్థి తరఫున ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను గమనించగలరని, పోలైన ఓట్ల లెక్కకు సంబంధించిన సంతకం చేసిన వివరాల్ని కూడా అందుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎంలను సీల్ చేస్తారని, ఆ సీల్స్‌పైనా వారి సంతకాలు ఉంటాయని వివరించారు. తర్వాత యంత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. .

### ముగ్గురు ఉండడం కరెక్టే

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్లు ఉండటాన్ని కూడా మాజీ అధికారులు సమర్థించారు. 1995లో సుప్రీం కోర్టు దీనిని సమర్థించిందని, ఒకే వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా ఉండటానికే ఈ విధానం ఉందని తెలిపారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఉండటం వల్ల కీలక నిర్ణయాలపై సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేరని అభిప్రాయపడ్డారు.

# భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభం

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్?లో తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉన్నందున చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్?లో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఎనిమిది నెలలు ప్రతీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనావేసి పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్?లో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని,



చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ మార్కెట్?లో విద్యుత్ అందుబాటులో లేదన్నారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్?ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

**ఆర్థిక సాయం అందించాలి**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సుమారు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నందున కరవు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని సీఎం గుర్తు చేశారు. వీబీ జీ రామ్‌జీ పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సీఎం సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తరువాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా , రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎప్పటికపుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు సిఎంఓ ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో టౌన్ షిప్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ రద్దు చేసిన హైకోర్టు

ఏ అవసరాల కోసం భూసేకరణ చేపడుతున్నారన్న అంశంపై స్పష్టత ఇవ్వకుండా టౌన్ షిప్ ఏర్పాటు, భవిష్యత్ ప్రాజెక్టుల అభివృద్ధి పేరుతో జారీ చేసిన నోటిఫికేషన్ చట్ట ప్రకారం చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పింది. మెదక్ జిల్లా రామచంద్రాపురం తెల్లాపూర్?లో ప్రతిపాదిత టౌన్షిప్ నిమిత్తం 2006లో జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్, 2007లో జారీ చేసిన డిక్లరేషన్?ను రద్దు చేసింది. అవసరమైతే చట్ట ప్రకారం తిరిగి భూసేకరణ చేపట్టవచ్చంటూ పేర్కొంది.

**పిటీషనర్ల అభ్యంతరాలను తిరస్కరించడం సరికాదు**

రామచంద్రాపురం మండలం తెల్లాపూర్?లోని పలు సర్వే నెంబర్లలో 92 ఎకరాల భూసేకరణ నిమిత్తం 2006 ఫిబ్రవరిలో జారీ చేసిన నోటిఫికేషన్?ను సవాలు చేస్తూ తెల్లాపూర్ 'జి'బ్లాక్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్?తోపాటు మరికొందరు దాఖలు చేసిన 8 పిటిషన్లపై జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సేకరించిన భూమిలో అసైన్డ్ కావడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, మిగిలినది పట్టా భూమి కావడంతో 594 ప్లాట్లను కొనుగోలు చేశారు. దీన్ని సేకరించడానికి అప్పటి హుడా జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్?లో చట్టవిరుద్ధంగా ఉన్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. టౌన్ షిప్ ఏర్పాటు, భవిష్యత్తు ప్రాజెక్టుల అభివృద్ధి అంటూ భూసేకరణ ఉద్దేశంపై అస్పష్టంగా ఉందన్నారు. అంతేగాకుండా భూ సేకరణ చట్టంలోని సెక్షన్ 5ఎ కింద విచారణ నామమాత్రంగా జరిగిందని వ్యాఖ్యానించారు. భూమి పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకోకుండా సరైన




కారణాలను పేర్కొనకుండా పిటీషనర్ల అభ్యంతరాలను తిరస్కరించడం సరికాదన్నారు. అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించినట్లు చూపితే సరిపోదని, అవసరమైతే తదుపరి విచారణ జరిపి తగిన కారణాలతో నిర్ణయం వెలువరించాల్సి ఉందన్నారు. ఇదే భూసేకరణ నోటిఫికేషన్?లో భాగమైన భూములకు చెందిన భూసేకరణను 2006 ఫిబ్రవరిలో రద్దు చేసిందని, అందువల్ల ఒకే నోటిఫికేషన్?ను సంబంధించి లోపాలను గుర్తించినప్పుడు అదే పరిస్థితుల్లో ఉన్న ఇతర భూ యజమానుల విషయంలో భిన్నమైన నిర్ణయం తీసుకోలేమని అన్నారు. భూసేకరణ నోటిఫికేషన్లను రద్దు చేస్తూ అవసరమైతే చట్టం నిర్దేశించిన ప్రకారం తిరిగి భూసేకరణ ప్రక్రియ చేపట్టవచ్చంటూ తీర్పు వెలువరించారు.

# ఒరిజినల్ మీ దగ్గరే ఉన్నా డూప్లికేట్ పేపర్లతో స్థలం మార్టిగేజ్ చేస్తున్న ముఠాలు

తక్కువ ధరకు స్థలం వస్తుందని ఊరు శివార్లలో స్థలం కొని అక్కడ పడేశారా ఎందుకైనా మంచిది ఒకసారి వెళ్లి చూసుకోండి. ఎప్పుడో పాతిక, ముప్ఫై ఏళ్లనాడు ఆస్తి కొనేసి అమెరికా వెళ్లిపోయారా మీ ప్రాపర్టీపై ఆశలు వదులుకోవాల్సిందే. పత్రాలు మన దగ్గరే ఉన్నాయి. ఆస్తి ఎక్కడికి పోతుందులేనని నిశ్చింతగా ఉన్నారా? మీ కళ్లే మిమ్మల్ని నమ్మలేనంతగా నకిలీ పత్రాలు వారి చేతుల్లో ఉంటాయి. రెండింటిని పక్కపక్కన పెడితే ఏదీ మీదో కూడా మీరు పోల్చుకోలేరు. అసలు మీ చేతుల్లో ఉన్న పత్రాలతో పనేలేదు. ఎందుకంటే ఇప్పటికే ఆ స్థలం ముగ్గురు, నలుగురు చేతులు మారిపోయి ఉంటుంది. మీరు కోర్టుకు వెళ్లినా నిరూపించుకోలేనంతగా అధికారుల సంతకాలు సైతం ఫోర్జరీ చేసి కోట్ల విలువైన స్థలాలు కొట్టేస్తున్నారు. మార్ట్‌గేజ్ ఆస్తులను విడిపించి ఇష్టానుసారం అమ్ముకుంటున్నారు. దీనికోసం ఏకంగా నకిలీ అధికారులతో వేషాలు వేయించడం సంతకాలు ఫోర్జరీ చేయడం, దొంగ స్టాంప్‌లు సృష్టించడం చేస్తున్నారు.

**సులభంగా డబ్బులు సంపాదించాలని**

కాకినాడకు చెందిన దేవగుప్తపు వెంకట సత్యనారాయణ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఉంటున్నాడు. గతంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై మంచి అవగాహన ఉంది. సరూర్‌నగర్‌కు చెందిన పోలె జనార్ధన్‌తో కలిసి ఇక్కడే ఓ మీసేవా కేంద్రం నిర్వహించాడు. ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలన్న కాంక్షతో నకిలీ పత్రాల దందాకు తెరలేపారు. యూసఫ్‌గూడకు చెందిన మహమ్మద్ జహీర్ అహ్మద్, గులాం మహ్మద్‌ఖాన్‌తో ఒప్పంద కుదుర్చుకున్నారు. వీరు మార్టిగేజ్ నుంచి ఆస్తిని విడిపించుకోవాలనుకునే వారికి



గాలం వేస్తారు. మొత్తం పని తామే చూసుకుంటామంటూ వారిని నమ్మించి సత్యనారాయణ దగ్గరకు తీసుకొస్తారు. ఇక అక్కడ నుంచి అసలు కథ మొదలవుతుంది.

**ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ స్టాంప్‌లు**

కొత్తపేటకు చెందిన చెడీల శివనాగేశ్వరరావును జీహెచ్ ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిగా, యెంపల్లి మహిపాల్‌రెడ్డిని హెచ్ ఎండీఏ అధికారిగా చూపించి వారిని నమ్మిస్తారు. మరో ఇద్దరిని సాక్షులుగా నియమిస్తారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తనఖాలో ఉన్న మీ ఆస్తులు విడిపిస్తామని చెబుతారు. అధికారుల పేర ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ స్టాంప్‌లు వేసి మార్టిగేజ్ రిలీజ్ డీడ్లు, జీపీఏలు, సేల్ డీడ్లు వంటి నకిలీ ప్రత్రాలు సృష్టిస్తున్నారు. అనంతరం వాటి ద్వారా స్థలాలను ఒకరి తర్వాత మరొకరికి అమ్మేస్తున్నారు. అలాగే ఏళ్ల తరబడి ఖాళీగా స్థలాలపై కన్నేసి వాటికి నకిలీ ప్రత్రాలు సృష్టించి యజమానులకు తెలియకుండానే ఇతరులకు అంటగట్టేస్తున్నారు.

"ఏదైతే ఖాళీ జాగా ఉంటుందో దానికి సీసీ అప్లై చేస్తారు. ఆ తర్వాత సర్టిఫైడ్ సేల్ డీడ్ ఈ డాక్యుమెంట్‌కి సంబంధించి ఎస్ఆర్‌వోకి అప్లై చేస్తారు. వాళ్లే సర్టిఫైడ్ సేల్ ఒకటి తయారు చేసి పాతగా పాత సేల్ డీడ్‌లా చూపించే విధంగా లేదంటే ఒరిజినల్ వాళ్లు చనిపోయినట్టుగా, అసలైన వాళ్లు చనిపోవడంతో వాళ్ల పాత సేల్ డీడ్‌గా తదనంతరం వచ్చిన వాళ్ల పేరు మీద చేస్తున్నట్టు ఒక జీపీఎస్ సృష్టిస్తారు. మరో రెండు నెలల తర్వాత ఇంకొక్క సేల్ డీడ్ మరొకరికి అమ్మినట్టుగా సెకండ్ సేల్ డీడ్‌ని సృష్టిస్తారు"

**ఎల్బీ నగర్ పరిధిలోనే దందా**

ఇప్పటి వరకు కోట్ల విలువ చేస్తే ఆస్తులను నకిలీ పత్రాలు సృష్టించి మార్టిగేజ్ నుంచి విడిపించినట్లు నాటకమాడి ఇతరులకు అమ్మేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హయత్‌నగర్ సమీపంలోని పసుమాములలో 1250 చదరపు గజాలతో పాటు బాటసింగారంలో ఏకంగా 6 వేల చదరపు గజాల స్థలానికి నకిలీ మార్టిగేజ్ పత్రాలు సృష్టించి ఆస్తులను విడిపించినట్లు పోలీసులు గుర్తించారు.

**ప్రధాన నిందితునిపై గతంలోనూ కేసులు**

ఎల్బీనగర్‌లోని ఓ ఇంట్లో నకిలీ పత్రాలు తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్?వోటీ పోలీసులు దాడి చేసి సత్యనారాయణతోపాటు మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలు, స్టాంప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణపై ఇప్పటికే 10 కేసులు ఉన్నాయి. ఆస్తులు కొనేప్పుడు అన్ని విధాల విచారణ చేసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. నకిలీ పత్రాల వ్యవహారం భయటపడటంతో వీరిని నమ్మి స్థలాలు కొనుగోలు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. అలాగే ఇది కేవలం వీళ్లకే పరిమితం కాలేదని ఇలాంటి ముఠాలు హైదరాబాద్‌లో చాలా ఉన్నాయని పోలీసులు తెలిపారు. వారందరినీ పట్టుకుంటామని హెచ్చరించారు.

## ఎంఎస్ఎంఈ బలోపేతానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



-మొదటిపేజీ తరువాయి

విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎంఎస్ఎంఈలు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు.

క్షేత్రస్థాయిలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని..మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎస్ఎంఈలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



రాష్ట్రంలో బతుకమ్మ సంబురాలు మొదలయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో, సాంప్రదాయ దుస్తులతో మహిళలు, చిన్నారులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్ద పప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయి. ఇలా రోజుకొక్క పేర్లతో పిలుచుకుంటూ బతుకమ్మలు తయారు చేసి గౌరీ దేవికీ రోజుకొక రకంగా పిండివంటలు నైవేద్యంగా సమర్పిస్తారు. చివరిరోజు సద్దుల బతుకమ్మను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.

**బతుకునిచ్చే పండుగ**

తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి మొదలైన పూలతో చేసిన బతుకమ్మలు నేటి నుంచి ఇంటింటా కనువిందు చేస్తాయ్. పెళ్లైన పడతులు పుట్టింటికి వచ్చి ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. ఇళ్ల ముంగిళ్లలోనూ ఆలయాలు కూడళ్ల వద్దా, చెరువు గట్టల వద్దా బతుకమ్మలను ఒక్క చోటుకు చేర్చి పాటలు పాడి నృత్యాలు చేస్తారు

**పూలను పేర్చి ఆటపాటలతో సందడి**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్ తదితర చోట్ల పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు ఒక్క చోట చేరి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చి చప్పట్లు కొడుతూ చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. బతుకమ్మ నిర్వహణ కోసం పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతో పాటు విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచారు. మెదక్ జిల్లాలో పలు గ్రామాలలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బాలాజీ మఠం, హౌసింగ్ బోర్డు తదితర కాలనీల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడి పాడారు.

## కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ..

-మొదటిపేజీ తరువాయి




కూటమి, 3 రీజియన్లలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ విజయం సాధించాయి. ఎన్నికల ఫలితాలు ఈయూ కూటమికే అనుకూలంగా ఉండడంతో తమ గెలుపు ఖాయమని ఈయూ కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. కాగా, దూర ప్రాంత సర్వీసులకు డ్యూటీకి వెళ్లిన సిబ్బంది 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు వేయనున్నారు. ఆ సంఖ్య వందలలోనే ఉంటుందని, ఫలితాలపై ప్రభావం చూపదని ఈయూ తెలిపింది. ఈ నెల 17న ఫలితాలు అధికారికంగా వెలువడనున్నాయి.

ఇదిలా ఉండగా.. ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో ఓటమిపై అధికార కాంగ్రెస్ పార్టీ పోస్టుమార్టం చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎన్నికల సరళిపై నివేదిక తెప్పించుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో సొంత పార్టీ నేతలే ప్రత్యర్థి యూనియన్‌కు మద్దతు ఇచ్చినట్టు తెలుస్తోంది. కొన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు లైట్ తీసుకోవడం వల్ల ఓడిపోయారని రిపోర్ట్ వచ్చినట్టు సమాచారం. ఖమ్మం, నల్లగొండ మినహా మిగతా జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలు ఎన్నికలను పట్టించుకోలేదని తేలింది. కాగా, ఎన్నికల్లో వార్ వన్ సైడ్ ఉంటుందని భావించిన కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఇక, గ్రేటర్ పరిధిలో 26 యూనిట్లలో కేవలం 3 స్థానాల్లో మాత్రమే విజయం సాధించడంతో కాంగ్రెస్‌లో అంతర్మథనం నెలకొంది.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



## "రెండు స్వర్ణాలతో మెరిసిన చికిత"

"యువ ఆర్చర్‌ను సన్మానించిన బండారు దత్తాత్రేయ"

ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు

2025 ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లోనూ ప్రతిభ

సుల్తానాపూర్ యువతికి అంతర్జాతీయ గుర్తింపు

రెండు స్వర్ణాలతో దేశానికి కీర్తి తెచ్చిన ఆర్చర్ చికిత

యువ క్రీడాకారిణి తనిపర్తి చికితకు బండారు దత్తాత్రేయ సన్మానం

**హైదరాబాద్:** అంతర్జాతీయ స్థాయిలో ఆర్చరీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు సాధించిన యువ క్రీడాకారిణి తనిపర్తి చికితను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ లోని రాంనగర్‌లో ఉన్న తన నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన చికిత ఇటీవల జరిగిన 2026 ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఆర్చరీ మహిళల జట్టు, మిక్స్‌డ్ జట్టు విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతేకాకుండా, 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు తొలి ఒలింపిక్ కోటా సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2025లో జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-21 వ్యక్తిగత విభాగంలో ప్రపంచ టైటిల్ సాధించిన తొలి భారతీయ మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా చికిత రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్న యువ క్రీడాకారిణిని ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 11వ తేదీ నుండి కట్ట మైసమ్మ దేవాలయ శరన్నవరాత్రి ఉత్సవాలు

**హైదరాబాద్ :** లోయర్ ట్యాంక్ బండ్ తనకాల కట్ట మైసమ్మ దేవాలయ శరన్నవరాత్రి ఉత్సవాలను 11వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా దేవి శరన్నవరాత్రులను ఘనంగా జరుపుకోనున్నట్టు పేర్కొన్నారు ఈ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రముఖులు రానున్నట్లు తెలిపారు. భక్తులు ఇక్కడకు అధిక సంఖ్యలో వస్తారని వారికి అన్ని సౌకర్యాలను కల్పించనున్నట్టు స్పష్టం చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజు ఒక్కో దేవత రూపంగా అలంకరించడం జరుగుతుందని వివరించారు. చివరి రోజు అమ్మవారి అలంకరణ మహిషాసుర మర్దినిగా ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## చాదర్‌ఘాట్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

**హైదరాబాద్ :** మలక్‌పేటలోని డీ-మార్ట్ సిగ్నల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎల్బీనగర్‌కు చెందిన బి. లావణ్య (25) తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనం నంబర్ టీఎ 09 ఈఈ 2709పై ఎల్బీనగర్ నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళ్తుండగా, డీ-మార్ట్ సిగ్నల్ వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరూ రోడ్డుపై పడిపోవడం జరిగింది. ఈ క్రమంలో లావణ్య అదే మార్గంలో వెళ్తున్న ఏపీ 39 జి 0361 నంబర్ గల బస్సు వెనుక చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి. సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని,ప్రమాదానికి సంబంధించి బస్సు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టడం జరిగింది.

## బేబీ రుక్సానా ఆరోగ్యంపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా

**సికింద్రాబాద్ :** గాంధీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ ఉషారాణి గారితో మంత్రి ఫోన్లో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాపకు పుట్టుకతోనే పెద్ద పేగు సమస్య ఉందని, ఈ సమస్యకు పాప పుట్టినప్పుడే నీలోఫర్లో సర్జరీ చేశారని ఉషారాణి తెలిపారు. ఇటీవలే గాంధీలో పాపకు మరో సర్జరీ జరిగిందని, మరో 3 నెలల తర్వాత ఇంకొక సర్జరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. పాపకు చికిత్స విషయంలో ఎలాంటి సమస్య లేదన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరిస్థితుల వల్లే రుక్సానా తల్లి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నదని ఉషారాణి తెలిపారు. కుటుంబ పరిస్థితులు, సరియైన ఉపాధి లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాప తల్లి మంత్రి కార్యాలయ అధికారులకు తెలిపారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, అద్దె ఇంట్లో ఉంటూ, దొరికిన పని చేసుకుంటూ తానే ఇద్దరు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఉపాధి కల్పించాలని ఆమె కోరగా, ఈ విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాపకు గాంధీలోనే పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రుక్సానా తల్లికి వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఉషారాణి వెల్లడించారు.

## సూర్యాపేట జిల్లా కేంద్రంలో కదం తొక్కిన గులాబీ శ్రేణులు.

**సూర్యాపేట:** జిల్లా ఏర్పడి 10 వసంతాలు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు నుండి కొత్త బస్టాండ్ వరకు 2కె రన్ నిర్వహించి, జిల్లాను ఏర్పాటు చేసిన కేసీఆర్ కి బీఆర్ఎస్ కార్యకర్తలు, పట్టణ ప్రజలు, యువత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు డా. గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్ రావు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, నంద్యాల దయాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు.

## ఎత్తం నరసింహ మృతికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం.

**వనపర్తి :** వనపర్తి మండలం చిట్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కురుమూర్తి తండ్రి ఎత్తం నరసింహ మృతి పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నరసింహ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు,సూర్యవంశం గిరి, చిట్యాల రాము,సర్పంచ్ శోభ కృష్ణ,అరుణ్ యాదవ్, దొడ్ల యాది, తప్పెడ అశోక్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇవే !

**విజయవాడ :** స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన స్థానాలకు సంబంధించిన గణాంకాలు ఇలా ఉన్నాయి. కార్పొరేషన్ మేయర్లకు సంబంధించి మొత్తం 17 స్థానాల్లో 6 స్థానాలను బీసీలకు కేటాయించారు. ఇది 35.29 శాతంగా ఉంది. అలాగే 106 మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో 35 స్థానాలు, 3,884 మున్సిపల్ వార్డుల్లో 1,273 వార్డులను బీసీలకు కేటాయించారు. జిల్లా పరిషత్ చైర్మన్లకు సంబంధించి మొత్తం 28 స్థానాల్లో 7 స్థానాలు బీసీలకు కేటాయించగా, 661 జెడ్పీటీసీ స్థానాల్లో 152 స్థానాలు, 661 ఎంపీపీ స్థానాల్లో 152 స్థానాలు బీసీలకు దక్కాయి. అదేవిధంగా 9,913 ఎంపీటీసీ స్థానాల్లో 2,400 స్థానాలను బీసీలకు కేటాయించారు.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల అంతర్రాష్ట్ర ఆపరేషన్లు

**హైదరాబాద్ :** నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సెప్టెంబర్ 2026 నెలలో నమోదైన పలు ఔఆఖీఖ ఫిర్యాదులపై వేగంగా స్పందించి, మొత్తం 83 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఈ నెలలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా 9 విభిన్న రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి 23 సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి 35 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో స్తంభింపజేసిన మొత్తం 88,48,134 రూపాయలను బాధితులకు విజయవంతంగా తిరిగి వాపసు (రిఫండ్) చేయించారు. ఈ సెప్టెంబర్ నెలలో అరెస్టయిన 35 మంది నిందితుల నేరాల స్వభావాన్ని పరిశీలిస్తే.. సోషల్ మీడియా నేరాలకు సంబంధించి 9 మంది, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో 7 మంది, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో 6 మంది, ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 5 మంది, ప్రకటనల మోసాల్లో 3 మంది, ఐడెంటిటీ థెఫ్ట్‌లో ఇద్దరు, ఎక్స్‌టార్షన్ (బెదిరింపులు) కేసులో ఒకరు, జాబ్ ఫ్రాడ్‌లో ఒకరు, కస్టమర్ కేర్ మోసంలో ఒకరు చొప్పున ఉన్నారు. వీరు అరెస్ట్ అయిన రాష్ట్రాల వారీగా వివరాలు చూస్తే.. తెలంగాణ నుండి 10 మంది, ఆంధ్రప్రదేశ్ నుండి 9 మంది, మహారాష్ట్ర నుండి 6 మంది, కేరళ నుండి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుండి ముగ్గురు, బీహార్ నుండి ఒకరు, హర్యానా నుండి ఒకరు, రాజస్థాన్ నుండి ఒకరు మరియు పంజాబ్ నుండి ఒకరు ఉన్నారు. నిందితుల వద్ద నుండి 10 మొబైల్ ఫోన్లు, 07 చెక్ బుక్కులు, ఒక షెల్ కంపెనీ సీల్ స్టాంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ మోసాల పద్ధతుల (ఓనీటబీబ ాజూవతీజీనిటతి) వారీగా బాధితులు కోల్పోయిన మొత్తం మరియు పోలీసులు వాపసు చేయించిన రిఫండ్ వివరాలను పరిశీలిస్తే.. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కి చెందిన 17 కేసుల్లో బాధితులు ?7,68,42,420 నష్టపోగా ?9,20,201 రిఫండ్ చేయించారు. ట్రేడింగ్ ఫ్రాడ్ 11 కేసుల్లో ?8,43,49,836 పోగొట్టుకోగా ?40,24,762 వాపసు ఇప్పించారు. 5 ఓటీపీ ఫ్రాడ్ కేసుల్లో ?23,71,465 పోగా ?24,68,321 రిఫండ్ అయ్యాయి. 2 ఏపీకే ఫైల్ ఫ్రాడ్ కేసుల్లో ?8,18,716 నష్టపోగా ?5,50,832 రిఫండ్ చేయించారు. ప్రకటనల మోసం ఒక కేసులో ?1,29,000




పోగా ?50,016 వాపసు ఇచ్చారు. డిజిటల్ అరెస్ట్ ఒక కేసులో ?85,00,047 నష్టపోగా ?6,91,076, మరియు అనధికార యూపీఐ లావాదేవీల ఒక కేసులో ?4,84,674 నష్టపోగా 1,42,926 రిఫండ్ ఇప్పించారు. ఈ విధంగా మొత్తం 38 కేసుల్లో బాధితులు ?17,34,96,158 నష్టపోగా, పోలీసులు 88,48, 134 మొత్తాన్ని బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు. జోనల్ సైబర్ సెల్స్ డేటా ప్రకారం.. ఈ విభాగం పరిధిలో 2,767 ఔఆఖీఖ పిటిషన్లు రాగా, అందులో 381 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 10 కేసులలో 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, ?67,54,049 మొత్తాన్ని బాధితులకు రిఫండ్ చేశారు. డిజిటల్ మానిటరింగ్ ద్వారా సైబర్ పెట్రోల్ విభా గాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను పరిశీలిస్తే.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మైనర్లను అసభ్యకరంగా, బూతు మాటలతో చూపుతూ వీక్షణలు, లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు మరియు మానిటైజేషన్ పొందేందుకు రన్ చేస్తున్న 140 సోషల్ మీడియా ప్రొఫైల్స్, 30 పెయిడ్ ప్రకటనలను గుర్తించారు. అలాగే పాత నాణాలు, ?5 ట్రాక్టర్ నోట్లు, ?786 సిరీస్ నోట్లు, మోసపూరిత బెట్టింగ్ అంచనాలు, గ్యారెంటీ గెలుపుల పేరుతో మోసాలు చేస్తున్న ప్రొఫైళ్లను నిలిపివేశారు. వీటితో పాటు మ్యాట్రిమోనియల్, ప్రైవేట్ వీడియో కాల్ సర్వీసులు, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా అడ్వాన్స్ డబ్బులు, వ్యక్తిగత/ ఆర్థిక వివరాలు సేకరించే అనుమానాస్పద ఖాతాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ముందస్తు జాగ్రత్తగా ఈ 140 ఖాతాలను సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు రిపోర్ట్ చేసి తొలగించేలా (ఙజీనివని టనీలిని) చేశారు. సైబర్ పెట్రోల్ నిరంతర చర్యల్లో భాగంగా ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ సైట్లను ప్రచారం చేస్తున్న 1,457 ప్రొఫైల్స్, 2,603 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను నిలిపివేసి, వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై 09 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

# ప్రజా విశ్వాసం కోల్పోయిన పార్టీ

ఎక్స్పైరీ , ఔట్ డేటెడ్ పార్టీ బి ఆర్ ఎస్

మీడియా సమావేశంలో బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్

**కరీంనగర్ :** కరీంనగర్ లో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే డ్రామా రాజకీయాలు చేస్తోందని కిసాన్ నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రోజున కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీలో ఉన్నవారినే కొత్తగా చేరికలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని, ఇదొక పెద్ద ఫేక్ ప్రచారమని మండిపడ్డారు. కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సోషల్ మీడియాలో పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే ర్యాలీలు నిర్వహించి, చేరికల సమావేశాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు, ఇప్పుడు కాషాయ రంగును చూస్తే కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ప్రతి చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు, ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు. టౌన్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ఆ పదవికి అనర్హుడని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు.



మేయర్ పీఠాన్ని కోల్పోయి సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా చల్లా హరిశంకర్ సిగ్గులేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్,ఏడ్ల అశోక్, కంసాల శ్రీనివాస్ లతదితరుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. కరీంనగర్ కిసాన్ నగర్ లో దళితబంధు ఇళ్ళు ప్రొసీడింగ్స్ ల పేరుతో పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, దయచేసి వారందరికీ తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరారు. బీసీ నాయకుల ముసుగు కప్పుకొని దొరల పార్టీ వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత బంధు విషయంలో బాధితులు ఇప్పటికీ న్యాయం కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ వల్లే నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ , స్మార్ట్ సిటీ ద్వారా భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఒక 'అవుట్‌డేటెడ్' పార్టీ అని, ఆ మునిగిపోయే నావలో చేరేందుకు ఎవరూ సిద్ధంగా లేరని విషయాన్ని బిఆర్ఎస్ నాయకత్వం గ్రహిస్తే మంచిదన్నారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.. కరీంనగర్లో ఇక బి ఆర్ ఎస్ కు స్థానం లేదని రాబోయే రోజుల్లో కరీంనగర్ అసెంబ్లీ లో కూడా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రే పద్మా అనిల్, పొన్నం మండన్నా కార్యకర్తలు గాలి సురేష్, కళ్యాణ్, విష్ణు ప్రసాద్, పవన్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

జిల్లా ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు

ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడపడుచుల ఆత్మీయతను చాటే పూల పండుగ బతుకమ్మ

బతుకమ్మ నిమజ్జనం సమయంలో తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలి ...

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, అందంగా బతుకమ్మలను పేర్చి చిన్నా,పెద్ద తేడాలేకుండా మహిళలు ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, ప్రకృతితో మానవాళికి ఉన్న విడదీయలేని అనుబంధాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని, జిల్లా మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకల అనంతరం గోదావరితో పాటు చెరువులు, కుంటలు, వాగుల వద్ద నిమజ్జనం చేసే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. నీటిలోకి లోతుగా వెళ్లకూడదని, చిన్నపిల్లలను నిమజ్జన ప్రాంతాల వద్దకు తీసుకెళ్లొద్దని స్పష్టం చేశారు. భద్రతా సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు .సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ బతుకమ్మ పండుగను సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. నిమజ్జన ప్రాంతాలలో మున్సిపల్, పంచాయతి అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక భరోసా కల్పిస్తాం

**తాండూర్** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతలను అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రత్యేక అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను పరిశీలించి, నిజనిర్ధారణ చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లు అందించే లక్ష్యంతో గత నెలలో దరఖాస్తులు స్వీకరించింది. ఈ దరఖాస్తుల పరిశీలనను విడతల వారీగా చేపట్టిన అధికారులు, చివరి విడతలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అర్హతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు డీపీఎం అన్నాజీ, ఏపీఎం రాజకుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొని దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. వారితోపాటు డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాదారం సర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చేయూత పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సూచనల మేరకు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందేలా అధికారులు,



ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉపసర్పంచ్ సూరం దామోదర్‌రెడ్డి, రాజీవ్‌నగర్ ఉపసర్పంచ్ కాపర్తి సుభాష్, కాంగ్రెస్ నాయకుడు అసంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# బంగారంతో.. చైనా మాస్టర్ ప్లాన్!

## నెట్‌ఫ్లిక్స్‌లో ఉద్యోగాల కోత.. వచ్చే వారమే ప్రకటన..!




**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది తమ మొత్తం సిబ్బందిలో దాదాపు 5 శాతం మందిని తొలగించేందుకు ప్రణాళికలు చేస్తోంది. వచ్చే వారం దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ.. ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీటిపై స్పందించేందుకు నెట్‌ఫ్లిక్స్ నిరాకరించింది. ఈ ఓటీటీ సంస్థ 2022లో భారీగా ఉద్యోగులను తొలగించింది. కంపెనీ వృద్ధి మందగించడం, సబ్‌స్క్రైబర్ల సంఖ్య తగ్గడంతో నాడు వందలాది మందిపై వేటు పడింది. గతేడాది చివరి నాటికి నెట్‌ఫ్లిక్స్‌లో సుమారు 16వేల మంది ఫుల్-టైమ్ ఉద్యోగులు ఉన్నారు. ప్రస్తుతం స్ట్రీమింగ్ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొంది. మరోవైపు ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ ప్రకటన ఆదాయంలో, వీక్షకుల సంఖ్యలోనూ వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో పోటీని ఎదుర్కొని ఆదాయాన్ని పెంచుకోవడానికి నెట్‌ఫ్లిక్స్ వ్యూహాలను మారుస్తోంది. ఇందులో భాగంగానే ప్రకటనల ఆధారిత ప్లాన్లు, లైవ్ ప్రోగ్రామింగ్, గేమింగ్ విభాగాల్లోకి పెట్టుబడులను మళ్లించడం వంటివి చేస్తోంది.

## దేశ విధానాలను బిలియనీర్‌లు నిర్దేశించలేరు..

## ఎలాన్ మస్క్‌కు కమల్ హాసన్ కౌంటర్..!



భారతదేశానికి ప్రధాని అంబానీనా అంటూ టెస్లా స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశ విధానాలను ఏ బిలియనీర్ నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ కౌంటర్‌కు నటి, ఎంపీ కంగనా రనౌత్ కూడా మద్దతు తెలిపారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు లైసెన్సింగ్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో స్పందించారు. భారత ప్రధాని అంబానీనా..? అంటూ సెటైరిక్‌గా ట్వీట్ చేశారు. దీనిపై కమల్ హాసన్ దీటుగా బదులిచ్చారు. ఏ బిలియనీర్ అయినా, అది భారతీయుడైనా అమెరికన్ అయినా.. దేశ విధానాలను నిర్దేశించలేరని వ్యాఖ్యానించారు. ప్రతి దేశం తన సొంత ప్రయోజనాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం గురించి చెప్పే పశ్చిమ దేశాలు రక్షణాత్మక విధానాలు పాటిస్తున్నాయని కమల్ హాసన్ విమర్శించారు. చైనా ఎలక్ట్రిక్ వాహనాలపై అమెరికా 100 శాతం సుంకాలు విధించి తన దేశీయ పరిశ్రమను కాపాడుకుంటోందని అన్నారు. భారత్ కూడా అదేవిధంగా తన దేశీయ తయారీ రంగాన్ని పరిరక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. భారత్ ఒక ప్రజాస్వామ్య దేశమని, వలసపాలిత ప్రాంతం (కాలనీ) కాదని వ్యాఖ్యానించారు. తాము ప్రపంచాన్ని స్వాగతిస్తామని, కానీ భారత ప్రజలుగా మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటామని కమల్ హాసన్ తన పోస్టులో స్పష్టంచేశారు. కమల్ పోస్టును షేర్ చేస్తూ కంగనా రనౌత్ స్పందించారు. కమల్ కౌంటర్ మస్క్‌కు బాగా తగిలి ఉంటుందని కంగనా తన పోస్టులో పేర్కొన్నారు. ఏ బిలియనీర్ దేశ విధానాలను నిర్దేశించకూడదని కమల్ చాలా స్పష్టంగా, వ్యంగ్యంగా, సూటిగా చెప్పారని ప్రశంసించారు. ఇప్పటికే మస్క్ ఆరోపణలను భారత కమ్యూనికేషన్ల శాఖ నిరాధారమైనవని కొట్టిపారేసింది.



ప్రపంచవ్యాప్తంగా.. దాదాపు అన్ని దేశాలు తమ ఆర్థిక నిల్వలను బలపరచుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే చైనా బంగారం కొనుగోళ్లను భారీగా పెంచుతోంది. సాధారణంగా మనం బంగారాన్ని ఆభరణాల కోసం.. లేదా పెట్టుబడిగా కొనుగోలు చేస్తాం. కానీ దేశాలు మాత్రం బంగారాన్ని కొనుగోలు చేయడం వెనుక పెద్ద ఆర్థిక వ్యూహం ఉంటుంది. చైనా కేంద్ర బ్యాంకు అయిన పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా (ప్రాదీుజ) 2026 సెప్టెంబర్‌లో ఏకంగా 23 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. సెప్టెంబర్ 2023 తర్వాత ఒక నెలలో చైనా కొనుగోలు చేసిన అత్యధిక బంగారం ఇదే కావడం విశేషం. అంతేకాదు.. చైనా వరుసగా 23 నెలల నుంచి బంగారాన్ని భారీగా కొనుగోలు చేస్తూనే ఉంది. జూలై, ఆగస్టు నెలల్లో 20 టన్నుల చొప్పున బంగారం కొనుగోలు చేసిన చైనా.. సెప్టెంబర్‌లో ఆ మొత్తాన్ని 23 టన్నులకు పెంచింది. దీంతో 2026లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన బంగారం 103 టన్నులకు చేరినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం చైనా వద్ద మొత్తం 2,410 టన్నుల బంగారం ఉన్నట్లు తెలుస్తోంది.

### చైనా ఎందుకు భారీగా బంగారం కొనుగోలు చేస్తోంది!

చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడానికి ప్రధాన కారణం.. తన ఆర్థిక నిల్వలను మరింత పెంచుకోవడానికే. ప్రస్తుతం ప్రపంచ దేశాలు తమ విదేశీ నిల్వల్లో ఎక్కువ భాగాన్ని డాలర్లు, ఇతర కరెన్సీలు, ప్రభుత్వ బాండ్ల రూపంలో ఉంచుతాయి. అయితే.. ఒకే కరెన్సీపై ఎక్కువగా ఆధారపడితే, ఆ కరెన్సీ విలువలో మార్పులు వచ్చినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే.. చైనా తన నిల్వల్లో బంగారం వాటాను గణనీయంగా పెంచుకుంటోంది. బంగారం అనేది ఏ ఒక్క దేశ ప్రభుత్వంపై ఆధారపడని ఆస్తి. ఆర్థిక అనిశ్చితి పెరిగినప్పుడు లేదా అంతర్జాతీయ పరిస్థితులు ప్రతికూలంగా మారినప్పుడు బంగారం ఒక ప్రత్యామ్నాయ నిల్వగా ఉపయోగపడుతుంది.

### ఫ్రాన్స్, ఇటలీలకు దగ్గరవుతున్న చైనా!

ప్రస్తుతం బంగారు నిల్వల పరంగా చైనా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ దేశాలు దాని కంటే ముందున్నాయి. అయితే.. ఇప్పుడు ఈ దేశాలకు, చైనాకు మధ్య ఉన్న అంతరం క్రమంగా తగ్గుతోంది. కొన్ని నివేదికల ప్రకారం.. ఇటలీ వద్ద సుమారు 2,452 టన్నులు, ఫ్రాన్స్ వద్ద 2,437 టన్నుల బంగారం ఉంది. చైనా వద్ద 2,410 టన్నులు ఉన్నాయి. అంటే.. ఫ్రాన్స్‌ను అధిగమించడానికి చైనాకు మరో 27 టన్నులు, ఇటలీని అధిగమించడానికి 42 టన్నులు మాత్రమే అవసరం. ఇదే వేగంతో చైనా బంగారం కొనుగోళ్లను కొనసాగిస్తే.. భవిష్యత్తులో ఫ్రాన్స్, ఇటలీ దేశాలను వెనక్కి నెట్టి ముందుకు వెళ్లే అవకాశం ఉంది. అయితే అది ఎప్పుడు జరుగుతుందనేది చైనా భవిష్యత్తులో చేసే కొనుగోళ్లపై ఆధారపడి ఉంటుంది.

## మస్క్.. ఈ వాస్తవాలు సరిపోతాయా: శ్రీధర్ వెంబు కౌంటర్



ఇంటర్నెట్‌డెస్క్: స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు భారత్‌లో అనుమతుల జాప్యంపై మాటల దాడి చేస్తోన్న టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీపై విమర్శలు సంధించిన సంగతి తెలిసిందే. మస్క్ తీరుపై పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ డేటా ధరలు ఉన్న దేశం భారత్ అని వ్యాఖ్యానించారు. వాస్తవాలను తెలుసుకోవాలంటూ మస్క్‌కు కౌంటర్ ఇచ్చారు. శ్రీధర్ వెంబు పోస్ట్ ఇలా..

"ప్రపంచంలోనే డేటా ధరలు అత్యంత తక్కువగా ఉన్న దేశం భారత్. నేను ఈ దేశంలో ఎక్కడ పర్యటించినా సరే.. స్థానికంగా ఉన్న వైఫైతో సులభంగా కనెక్ట్ అవుతాను. నా ఫోన్‌లోని డేటాను వాడటం కోసం ఈజీగా కంప్యూటర్‌తో అనుసంధానిస్తాను. భారతీయులు సాధారణంగా డ్యూయల్ సిమ్‌లున్న ఫోన్లు, ధరలు తక్కువగా ఉండటంతో భారీ డేటా ప్లాన్లను ఉపయోగిస్తుంటారు. అంబానీ తీసుకొచ్చిన జియో (జీఅశీ)నే ఇందుకు కారణం.

ప్రపంచంలోనే ఔషధాల ధరలు తక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. వీటి ధరలు ఇంకా తగ్గుతూనే ఉన్నాయి. భారత్‌ను సందర్శించే ప్రజలు.. ఇక్కడి నుంచి ఔషధాలను తీసుకెళ్తుంటారు.

ప్రపంచంలోనే అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపుల వ్యవస్థ భారత్‌లోనే ఉంది.

మోదీ ప్రభుత్వం గుత్తాధిపత్యాన్ని సహించదు. ప్రధాని స్టార్టప్‌లను ప్రోత్సహించారు. పోటీతత్వ ఆర్థిక వ్యవస్థకు ఇదే మెరుగైన సంకేతం. అమెరికా మార్కెట్లో చైనా ఎలక్ట్రిక్ వాహనాల పోటీ నుంచి టెస్లా కంపెనీకి రక్షణ ఉంది. దీనివల్ల అమెరికాలో ఇతర దేశాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రభుత్వ విధానాల కారణంగానే భారతీయ స్టార్టప్‌లు తక్కువ ఖర్చుతో కూడిన రాకెట్ల తయారీలో పురోగతిని సాధిస్తున్నాయి. అవి స్పేస్‌ఎక్స్‌కు ముప్పుగా పరిణమిస్తున్నాయి. అదేవిధంగా చైనా ఈవీలు టెస్లా (ఐవంశ్రీఖ)కు ముప్పుగా మారాయని చెప్పొచ్చు" అని వెంబు తన పోస్టులో పేర్కొన్నారు. 'ఇవన్నీ వాస్తవాలు ఎలాన్' అంటూ స్పేస్‌ఎక్స్ అధినేతకు కౌంటర్ ఇచ్చారు.

# మళ్లీ పరుగుల వరదేనా?

# భారత బౌలర్లకు మరో అగ్నిపరీక్ష!

**మూడో టీ20కి ఇండోర్‌లో రంగం సిద్ధం**

**హోప్, రూథర్‌ఫోర్డ్ భీకర ఫామ్**

**శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి**

**సంజూ శాంసన్ కూడా సత్తా చాటాడు**

**బౌలర్ల ప్రదర్శనపైనే భారత్ ఆశలు**



భారత్, వెస్టిండీస్ మధ్య మరో హైస్కోరింగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రెండో టీ20లో పరుగుల వరద పారగా.. ఇప్పుడు మూడో టీ20లోనూ బ్యాటర్లదే ఆధిపత్యం కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం చిన్న బౌండరీలు, బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్ ఉండటంతో బౌలర్లకు మరోసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఆదివారం రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది. రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిపి ఏకంగా 501 పరుగులు చేశాయి. తొలుత భారీ స్కోరు చేసిన భారత్‌ను వెస్టిండీస్ దీటుగా ఎదుర్కొంది. 250 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ మిగిలి ఉండగానే ఛేదించి సంచలన విజయం సాధించింది. దీంతో భారత బౌలింగ్ వైఫల్యాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బౌలర్ల ప్రదర్శనపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇండోర్ పిచ్ కూడా బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందని అంచనా. చిన్న బౌండరీలకు తోడు మంచు ప్రభావం కూడా మ్యాచ్‌పై కీలక పాత్ర పోషించనుంది. దీంతో బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ తప్పకుండా బంతులు వేయాల్సి ఉంటుంది. ఫీల్డింగ్‌లోనూ చిన్న తప్పిదాలకు అవకాశం ఇవ్వకూడదు.

రాంచీలో భారత పేసర్ మయాంక్ యాదవ్ పవర్‌ప్లేలో మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. అయితే షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను వదిలేయడం భారత్‌కు భారంగా మారింది. ఆ సమయంలో 18 బంతుల్లో 38 పరుగులతో ఉన్న రూథర్‌ఫోర్డ్.. ఆ తర్వాత 37 బంతుల్లో 84 పరుగులు చేసి చెలరేగాడు. ఏడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి 120 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. హోప్ కూడా అజేయ శతకంతో జట్టును గెలిపించాడు.

ఈ సిరీస్‌లో హోప్ ఇప్పటికే రెండు సెంచరీలు సాధించడంతో భారత బౌలర్లకు అతడిని త్వరగా ఔట్ చేయడం కీలకం. మయాంక్‌కు అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, శివమ్ దూబే, నమన్ ధీర్ నుంచి సహకారం అవసరం.

మరోవైపు భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం జట్టుకు సానుకూలాంశం. ఇండోర్‌లో అజేయంగా 102 పరుగులు చేసిన అతడు.. రాంచీలో 18 బంతుల్లోనే 40 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కూడా 41 బంతుల్లో 82 పరుగులతో ఫామ్ అందుకున్నాడు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం రావడం కష్టంగా కనిపిస్తోంది.

వెస్టిండీస్ మాత్రం రూథర్‌ఫోర్డ్, హోప్ ఫామ్‌తో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. రోస్టన్ చేజ్ కూడా రెండో టీ20లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో బ్యాటర్ల జోరు కొనసాగుతుందా? భారత బౌలర్లు పుంజుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

**మ్యాచ్ వివరాలు**

**మ్యాచ్: భారత్--వెస్టిండీస్ మూడో టీ20**

**తేదీ: ఆదివారం, అక్టోబర్ 11**

**సమయం: రాత్రి 7 గంటలకు**

**వేదిక: హోల్కర్ స్టేడియం, ఇండోర్**

**ప్రత్యక్ష ప్రసారం: స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్**

# స్పోర్ట్స్

## సెంచరీ దిశగా రహ్మత్ షా..

## బంగ్లాకు ధీటుగా బదులిస్తున్న ఆఫ్ఘన్




అబుదాబీ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 346 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆఫ్ఘనిస్తాన్ బంగ్లాదేశ్‌కు ధీటుగా బదులిస్తుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 4 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్, కెప్టెన్ రహ్మత్ షా (84 నాటౌట్) సెంచరీ దిశగా సాగుతున్నాడు. అతడికి జతగా వికెట్‌కీపర్ ఇక్రమ్ అలీఖిల్ (26 నాటౌట్) బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. అంతకుముందు ఓపెనర్ అబ్దుల్ మలిక్ (62) అర్ధ సెంచరీతో రాణించారు. సెదికుల్లా అటల్ 17, షాహిదుల్లా కమల్ 20, సీనియర్ బ్యాటర్ హష్మతుల్లా షాహిది డకౌటయ్యారు. బంగ్లా బౌలర్లలో ఎబాదత్ హొసేన్ 2, హసన్ మహమూద్, మెహిది హసన్ మిరాజ్ తలో వికెట్ పడగొట్టారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (67), తంజిద్ హసన్ (83)తో పాటు వికెట్‌కీపర్ లిట్టన్ దాస్ (53) అర్ధ సెంచరీలతో రాణించారు. మొమినుల్ హక్ (39), కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (29), మెహిది హసన్ మిరాజ్ (24), నయీమ్ హసన్ (35 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. వెటరన్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం, ఎబాదత్ హొసేన్ డకౌట్లు కాగా.. హసన్ మహమూద్ 2, తైజుల్ ఇస్లాం 9 పరుగులు చేశారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ సలీం సఫీ 4, యమిల్ అహ్మద్‌జాయ్ 3, ఇస్మత్ ఆలం 2, ఖైస్ అహ్మద్ ఒక వికెట్ తీశారు.

